
Email : telanganaveenaofficial@gmail.com

Title Code : 12280

# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..

సంపుటి :1 సంచిక : 91 హైదరాబాద్ గురువారం 14 -12 - 2023 పేజీలు : 8 రూ.4






### ధరణి పోర్టల్‌పై సీఎం రేవంత్ రెడ్డి

## సంచలన నిర్ణయం..?

**తెలంగాణ వీణ/హైదరాబాద్:** తెలంగాణ రెండో ముఖ్య మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన రేవంత్ రెడ్డి పాలనలో తనదైన దూకుడు ప్రదర్శిస్తున్నారు. సీఎంగా బాధ్యతలు తీసుకున్న మొదటి రోజు నుండి వరుసగా అధికారులతో సమీక్షలు, రివ్యూలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే విద్యుత్, టీఎస్పీఎస్సీ, రైతు బంధు అంశాలను టేకప్ చేసిన రేవంత్ రెడ్డి.. తాజాగా సమస్యల నిలయంగా మారిన ధరణి పోర్టల్‌పై ఫోకస్ పెట్టారు. కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం మహ్మాతా జ్యోతిబాపూలే భవన్లో నిర్వహిస్తోన్న ప్రజా దర్బార్‌లో సైతం ఎక్కువగా ధరణి పోర్టల్‌పైనే ఫిర్యాదులు రావడంతో రేవంత్ దీనిపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా ఇవాళ మధ్నాహ్నం సచివాలయంలో ధరణి పోర్టల్‌పై రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించున్నారు. ఈ మీటింగ్‌కు రెవిన్యూ మంత్రి పొంగులేటి, సంబంధిత శాఖ అధికారులు హాజరుకానున్నారు. అయితే, భూముల

వివరాలు 2లో

### కోమటిరెడ్డిని పరామర్శించిన

## ఎమ్మెల్సీ కవిత



**తెలంగాణ వీణ/హైదరాబాద్ :** మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డిని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ నాయకురాలు కల్వకుంట్ల కవిత పరామర్శించారు. కొన్ని రోజులుగా గొంతు నొప్పితో బాధప డుతున్న కోమటిరెడ్డి... ఢిల్లీ నుంచి రాగానే సోమాజిగూడలోని యశోద ఆసుపత్రిలో చేరారు. మంత్రికి వైద్య పరీక్షలు చేసిన వైద్యులు.. రెండు రోజులు ఆసుపత్రిలోనే ఉండాలని సూచించారు. దీంతో ఆయన యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రిలో ఆయనను పలువురు రాజకీయ నాయకులు పరామ ర్శిస్తున్నారు. మధ్యాహ్నం కవిత ఆయనను పరామర్శించారు. కోమటిరెడ్డి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మంత్రి త్వరగా కోలుకోవాలని కవిత ఆకాంక్షించారు. మంత్రి తుమ్మల ఆసుపత్రికి వచ్చి కోమటిరెడ్డిని పరామర్శించారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కూడా పరామర్శించారు.

### 500 గ్యాస్ కోసం ..ఎల్‌పీజీ పంపిణీ

## కేంద్రాల వద్ద భారీ క్యూ



**తెలంగాణ వీణ/హైదరాబాద్:** తెలంగాణ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ 6 గ్యారెంటీ పథకాలను ప్రకటించిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.500 గ్యాస్ ఇస్తామని గట్టిగ ప్రచారం చేసారు. ఇక ఇప్పుడు కాంగ్రెస్ అధికా రంలోకి రావడం , రేవంత్ సీఎం అవ్వడం..ప్రకటించిన 6 గ్యారెంటీ పథకాల్లో ఇప్పటికే మహాలక్ష్మి , రాజీవ్ ఆరోగ్య పథకాలను ప్రారంభించడం జరిగింది.ఇక రూ.500 లకే గ్యాస్ ఇస్తామనన్నారు..ఎప్పుడు ఇస్తారో అని అంత ఎదురుచూడడం

వివరాలు 2లో



## మాజీ సిఎం కెసిఆర్‌కు ప్రముఖుల పరామర్శలు

- కెసిఆర్‌ను పరామర్శించిన సుప్రీంకోర్టు మాజీ సీజే ఎన్.వి.రమణ
- సినీ హీరో నాగార్జున,వరప్రసాద్‌రెడ్డి తదితరులు

**తెలంగాణ వీణ/హైదరాబాద్ :** తుంటి ఎముక గాయంతో యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రికు పరామర్శలు కొనసాగుతున్నాయి. బుధవారం ఉదయం నుంచి కెసిఆర్‌ను పరామర్శించిన వారిలో రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు రేణుక చౌదరి, సినీ హీరో నాగార్జున, సుప్రీం కోర్ట్ మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి రమణ, శాంతా బయోటిక్స్ అధినేత వరప్రసాద్ రెడ్డి ఉన్నారు. వీరితో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు, బిఆర్ఎస్ ఎంఎల్ఎలు, నాయకులు, అభిమానులు..అధినేత కెసిఆర్‌ను కలిసి పరామర్శించారు. ఆసుపత్రిలో మాజీ సిఎం కెసిఆర్ దగ్గర కెటిఆర్, జగదీశ్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, కొప్పుల ఈశ్వర్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు ఉన్నారు.

### రేపు యశోద ఆసుపత్రి నుంచి కెసిఆర్ డిశ్చార్జ్

తుంటి ఎముక గాయంతో సోమాజిగూడ యశోద ఆసుపత్రిలో చికిత్స బిఆర్ఎస్ అధినేత శుక్రవారం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉంది. ఈ మేరకు వైద్యులు అవసరమైన ఏర్పా ట్లు చేస్తున్నట్లు తెలిసింది. గత గురువారం రాత్రి ఎర్రవల్లి నివాసం లోని బాత్‌రూంలో జారిపడటంతో కెసిఆర్ ఎడమ తుంటికి తీవ్ర గాయమైన సంగతి తెలిసిందే. సోమాజిగూడలోని యశోద ఆస్పత్రి వైద్యులు ఆయనకు శుక్రవారం రాత్రి తుంటి మార్పిడి శస్త్రచికిత్స చేశారు.ప్రస్తుతం కెసిఆర్ ఆస్పత్రిలోనే ఉంటూ కోలుకుంటున్నారు.

## ప్రభుత్వాన్ని ఎలా నడుపుతారో ఇప్పుడు చూస్తాం: కేటీఆర్



**తెలంగాణ వీణ/హైదరాబాద్:** తెలంగాణలో కొత్త ప్రభుత్వం ఏర్పాటైంది. 2014 నుంచి టీఆర్ఎస్ ( ఇప్పుడు బీఆర్ఎస్) ప్రభుత్వం అధికారంలో ఉండగా.. తాజాగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ ఓటమి పాలైంది. తెలంగాణ ఆవిర్భావం తర్వాత తొలిసారిగా కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరింది. కాంగ్రెస్ ప్రభుత్వం పాలనపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ కార్యనిర్వహక అధ్యక్షుడు కేటీఆర్ కీలక కామెంట్స్ చేశారు. అసెంబ్లీ ఆవరణలో మీడియాతో చిట్ చాట్ చేసిన ఆయన.. కాంగ్రెస్ ప్రభుత్వంపై సంచలన కామెంట్స్ చేశారు. ఎన్నికల్లో గెలిచేందుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ ప్రజలను మభ్య పెట్టిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏనాడూ పద్దు మీద చర్చ జరగలేదని చెప్పారు. తాము అధికారంలో ఉన్న సమయంలో ప్రతి ఏడాది పీఏసీ, కాగ్ రిపోర్ట్స్ ఇస్తున్నామన్నారు. ప్రతి ఏటా ఆడిట్ లెక్కలు తీస్తున్నామని తెలిపారు. లెక్కలు వేసుకొని హామీలు ఇస్తారా? హామీలు ఇచ్చి లెక్కలు వేసుకుంటారా ? అని ప్రశ్నించారు. తాము ప్రతి ఏడాది పద్దులపై శ్వేత పత్రం విడుదల చేశామని గుర్తు చేశారు.రేపు (డిసెంబర్ 14) గవర్నర్ ప్రసంగంలో ఇదే పాత చింతకాయ పచ్చడి చెబుతారని.. రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేసి మాకు ఇచ్చారని కాంగ్రెస్ సభ్యులు అంటారని వ్యాఖ్యనించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ ఎమ్మెల్యే తమ నియోజకవర్గంలో 45 వేల ఉద్యోగాలు

వివరాలు 2లో

### హైదరాబాద్ సిపిగా

## కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి బాధ్యతలు...



**తెలంగాణ వీణ/హైదరాబాద్:** పోలీస్ శాఖలో ఉన్నతాధికారుల బదిలీలపై కొత్త ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. తొలి విడతలో హైదరాబాద్ ప్రాంత అధికారుల్లో మార్పులు చేర్పులు చేసింది. శాంతిభద్రతల పరిరక్షణలో కీలకమైన హైదరాబాద్ కొత్త కమిషనర్‌గా కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డిని నియమించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి ఈరోజు హైదరాబాద్ సీపీగా బాధ్యతలు స్వీకరించారు. ముందుగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన ఆయన.. అనంతరం తన ఛాంబర్లో బాధ్యతలు స్వీకరించారు.శ్రీనివాస్ రెడ్డి 2007 తర్వాత తొలిసారి యూనిట్ అధికారిగా పనిచేయబోతున్నారు. 2005లో మహబూబ్‌నగర్ ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఆయన.. రెండేళ్లపాటు అక్కడే విధులు నిర్వహించారు. అనంతరం అవినీతి నిరోధక శాఖకు బదిలీ అయ్యారు. ఆ సమయంలోనే మద్యం సిండికేట్ కుంభకోణంలో

వివరాలు 2లో

### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి

## సీఎం రేవంత్‌రెడ్డి ఫోన్...



**తెలంగాణ వీణ/హైదరాబాద్:** కేంద్రమంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు కిషన్ రెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం ఫోన్ చేశారు. తెలంగాణకు రావాల్సిన నిధులు, ఇతర అంశాలపై పరస్పర సహకారం ఉండాలని ఆయనను సీఎం కోరారు. త్వరలోనే కేంద్ర ప్రభుత్వ ముఖ్యులతో సమావేశం ఏర్పాటు చేసేలా చొరవ చూపాలని కిషన్ రెడ్డికి సీఎం విజ్ఞప్తి చేశారు. తెలంగాణ అభివృద్ధి విషయంలో పూర్తి సహాయసహకారాలు అందించాలన్నారు.కాగా, సీఎం రేవంత్ రెడ్డి ధరణిపై సమీక్ష నిర్వహించారు. ధరణి లోటుపాట్లపై వారం, పదిరోజుల్లో నివేదిక ఇవ్వాలని సీసీఎల్ కమిషనర్ నవీన్ మిట్టల్‌ను ఆదేశించారు. వ్యవసాయ, వ్యవసాయేతర భూముల వివరాలు నివేదికలో పొందుపరచాలన్న సీఎం.. ధరణి యాప్ భద్రతపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ధరణి లావాదేవీలపై వస్తున్న విమర్శలకు డాటా రూపంలో వివరణ ఇవ్వాలని అధికారులను సీఎం ఆదేశించారు.

### డీప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు

## ప్రజా భవన్ కేటాయింపు



**తెలంగాణ వీణ/హైదరాబాద్ :** ప్రజాభవన్... ఇక నుంచి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారిక నివాసంగా ఉండ నుంది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాంగ్రెస్ ఏర్పడిన తర్వాత ప్రగతి భవన్‌ను మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌గా మార్చారు. ఇదే భవనంలో ప్రభుత్వం ప్రజా దర్బార్‌ను నిర్వహిస్తోంది. ఇది ప్రజా భవన్‌గా మారిన తర్వాత చాలాకాలంగా ఇక్కడ ఉన్న ఇనుప కంచెను తొలగించారు. ఈ భవనాన్ని మల్లు భట్టికి అధికారిక నివాసంగా కేటాయించారు. మరోవైపు ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం కోసం ప్రత్యామ్నా య భవనాన్ని అన్వేషిస్తున్నారని వార్తలు వస్తున్నాయి. ఎంసీఆర్ హెచ్ఆర్డీ భవనం సువిశాల స్థలంలో ఉంది. అన్ని సౌకర్యా లు ఉండటంతో పాటు భద్రతాపరంగా అనుకూలంగా ఉంది. పార్కింగ్‌కూ అనుకూలంగా ఉంది. దీంతో ఇక్కడే ఉండా లని చాలామంది సీఎం రేవంత్ రెడ్డికి సూచించారని చెబుతున్నారు.

### మత్స్యావతారంలో దర్శనమిస్తున్న

## భద్రాద్రి రామయ్య





**తెలంగాణ వీణ/ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో:** భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో ముక్కోటి వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలలో భాగంగా తొలి రోజు మత్స్యా వతారంలో రామయ్య దర్శనమిచ్చారు. సర్వాంగ సుందరంగా ముస్తాబైన రామాలయంలో వేద పండితులు, అర్చకులు వేకువజామున ప్రత్యేక పూజలు చేసి, బేడా మండపంలో మత్స్యావతారంలో భక్తులకు దర్శన భాగ్యం గావించారు. శ్రీమహావిష్ణువు ధరించిన అవతారాల వరుసలో మొదటి అవతారం మత్స్య అవతారం. ఈ అవతారానికి సంబంధించి రెండు గాథలు పురాణాలలో ఉన్నాయి. ఒకటి జ్ఞాననిధులైన వేదాలను బ్రహ్మ నుండి అపహరించి సముద్రంలో దాగి ఉన్న సోమకాసురుని సంహరించడానికై మత్స్యావతారం ధరించి వేదాలను ఉద్ధరించాడు. రెండవది జలప్రళయం నుండి నావలో ఉన్న వైవస్వత మనవును, సప్త ఋషులను, సృష్టికి అవసరమైన విత్తనాలను, ఔషధాలను రక్షించాడు. ఈ అవతారాన్ని పూజించడం వలన కేతు గ్రహ బాధలు తొలుగుతాయని భక్తుల విశ్వాసమని అర్చకులు తెలిపారు. అవతారాలు మొదటి రోజు కావడంతో భక్తులు విశేషంగా ఆలయానికి తరలివచ్చారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో ఎల్ రమాదేవి ప్రత్యేక దృష్టి పెట్టి, ఆలయ అధికారులకు పలు సూచనలు చేశారు.

# ధరణి పోర్టల్‌పై సీఎం రేవంత్ రెడ్డి సంచలన నిర్ణయం..?

(మొదటి పేజీ తరువాయి)

డిజిటలైజేషన్ కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి పోర్టల్ సమస్యల నిలయంగా మారిన విషయం తెలిసిందే. ధరణి పోర్టల్‌తో రాష్ట్రవ్యాప్తంగా ఎంతో మంది రైతులు, సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతేకాకుండా ధరణి పోర్టల్‌తో బీఆర్ఎస్ నేతలు అధికారులతో కుమ్మక్కై అసైన్డ్ ల్యాండ్స్‌ను, ఇతర ప్రభుత్వ భూములను రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున కబ్జా చేశారని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ధరణి పోర్టల్‌ను బంగాళాఖాతంలో కలిపి దాని స్థానంలో కొత్త విధానం తీసుకువస్తామని స్వయంగా రేవంత్ రెడ్డి అన్న సంగతి తెలిసిందే.ఇప్పుడు అధికారంలో రావడంతో వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని సమస్యల కుప్పగా మారిన ధరణి పోర్టల్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా ఓ కమిటీ వేసే యోచనలో కాంగ్రెస్ సర్కార్ ఉన్నట్లు సమాచారం. ఈ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా ధరణి పోర్టల్‌పై తదుపరి నిర్ణయం తీసుకోవాలని రేవంత్ రెడ్డి భావిస్తోన్నట్లు తెలుస్తోంది. ఇక, అధికారంలోకి వస్తే ధరణి పోర్టల్‌ను రద్దు చేస్తామని కాంగ్రెస్ ఇప్పటికే ప్రకటించడంతో.. ఇవాళ్టి సమీక్షపై ఉత్కంఠ నెలకొంది. ధరణి పోర్టల్‌పై రేవంత్ రెడ్డి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోనని సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# ప్రభుత్వాన్ని ఎలా నడుపుతారో ఇప్పుడు చూస్తాం: కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

ఇస్తామని చెబుతున్నాడని.. ఎలా ఇస్తారని అడిగితే ఇస్తామంటున్నారే తప్ప దానికంటూ ఓ ప్రొసీజర్ లేదని అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు చాలా ఉన్నాయని.. ఇప్పుడు అసలు ఆట మ్మొదలవుతుందని అన్నారు. ప్రభుత్వంలో ఉన్నప్పుడు ఆ బరువు వాళ్లకు తెలియాలని కేటీఆర్ అన్నారు. రెండు లక్షల రుణమాఫీ అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే చేస్తానన్న రాహుల్ గాంధీ హామీ ఏమైందని కేటీఆర్ ప్రశ్నించారు. మొదటి మంత్రి వర్గంలోనే ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత తెస్తమన్న హామీ ఎక్కడ? అని నిలదీశారు.

## స్పీకర్ ఎన్నికకు మద్దతు..

తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌గా గడ్డం ప్రసాద్ నామినేషన్ దాఖలు చేశారు. ఆయన ఏకగ్రీవ ఎన్నికకు బీఆర్ఎస్ పార్టీ మద్దతు ప్రకటించించింది. స్పీకర్ నామినేషన్ పత్రంపై సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహ, సీతక్క సంతకాలు చేశారు. బీఆర్ఎస్ తరుపున మద్దతు తెలుపుతూ కేటీఆర్ సంతకం చేశారు. ఎంఐఎం కూడా మద్దతు తెలపటంతో గడ్డం ప్రసాద్ ఎన్నిక ఏకగ్రీవం కానుంది.

# హైదరాబాద్ సిపిగా కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి బాధ్యతలు...

(మొదటి పేజీ తరువాయి)

పలువురు పోలీస్, ఎక్సైజ్ అధికారులతోపాటు ప్రజాప్రతినిధుల్ని సైతం అరెస్ట్ చేశారు. ప్రస్తుతం హైదరాబాద్ కొత్త సీపీగా బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం మీడియాతో మాట్లాడిన సీపీ శ్రీనివాస్ రెడ్డి.. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో గంజాయి నిర్మూలనకు కృషి చేస్తా.. డ్రగ్స్ ముఠాలను సహించేది లేదని తెలిపారు. డ్రగ్స్ ముఠాలకు ఈ రాష్ట్రంలో చోటులేదని హెచ్చరిస్తున్నామని.. పబ్స్, రెస్టారెంట్లు, ఫామ్‌హౌస్ యజమానులు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. డ్రగ్స్‌ను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు ఉంటాయని.. డ్రగ్స్ మహమ్మారిని కూకటివేళ్లతో పెకిలించాలని సీఎం చెప్పారని వెల్లడించారు.

500 గ్యాస్ కోసం ..ఎల్‌పీజీ పంపిణీ

# కేంద్రాల వద్ద భారీ క్యూ

(మొదటి పేజీ తరువాయి)



మొదలుపెట్టారు. ఈ క్రమంలోనే ఎలాగైనా సిలిండర్ సొంతం చేసుకోవాలని ఎల్‌పీజీ పంపిణీ కేంద్రాల వద్దకు చేరుకుని క్యూ కడుతున్నారు. పథకాన్ని ఎప్పటినుంచి ప్రారంభిస్తారని నిర్వాహకులను అడిగి తెలుసుకుంటున్నారు. ఈ కేవైసీ చేయించుకున్న వారికే ఇస్తారన్న ప్రచారం జరుగుతూండటంతో ఈ కేవైసీ చేయించుకునేందుకు పోటీ పడుతున్నారు. హైదరాబాద్ తో పాటు ఇతర జిల్లాల్లోనూ ఇదే పరిస్థఇతి కనిపిస్తోంది. ఏజెన్సీ ఉద్యోగులు మాత్రం మహాలక్ష్మి పథకానికి ఈకేవైసీకి సంబంధం లేదని, కాబట్టి డిసెంబర్ 31 లోగా చేసుకోవాలని వారికి చెబుతున్నారు. వెంటనే అప్‌డేట్ చేయకుంటే సబ్సీడీలు వెంటనే నిలిపివేస్తారని ఏజెన్సీలు మహిళలకు సూచిస్తున్నాయి.

# శాసనసభ సమావేశాలకు మూడెంచెల భద్రత: మంత్రి శ్రీధర్ బాబు

**- పోలీసు అధికారులకు ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఒవైసి - శానసభ వ్యవహారాల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు ఆదేశాలు - లోక్‌సభలో జరిగిన ఘటన నేపథ్యంలో భద్రత చర్యలపై అత్యవసర సమావేశం**



**తెలంగాణ వీణ/హైదరాబాద్ :** శాసనసభ సమావేశాలు సజావుగా సాగడానికి మూడెంచెల భద్రత చర్యలను పటిష్టంగా అమలు చేయాలని పోలీసు అధికారులకు ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఒవైసి, శానసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశాలు జారీ చేశారు. లోక్‌సభలోకి ఆగంతకులు చొచ్చుకుని వెళ్లిన సంఘటన నేపథ్యంలో బుధవారం రాత్రి స్పీకర్ కార్యాలయంలో శాసనమండలి చైర్మన్, శాసనసభ ప్రోటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఒవైసి, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు పోలీసు ఉన్నతాధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ అత్యవసర సమావేశంలో ఆగంతుకుల దుశ్చర్యను తీవ్రంగా ఖండించారు. శాసనసభ సమావేశాలు జరుగుతున్న ఈ తరుణంలో లోక్‌సభలో జరిగిన సంఘునట తరహా సంఘటనలు జరగకుండా పటిష్ట భద్రత చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు ఆదేశించారు. అసెంబ్లీ ప్రాంగణంలోకి ప్రవేశించే ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ప్రొటెం స్పీకర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇప్పటికే జారీ చేసిన పాసులు తప్ప ఇతరత్రా అన్ని రకాల పాసుల జారీని నిలిపివేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఒవైసి, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి, డి.జి.పి రవి గుప్త, హైదరాబాదు పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి తదితర పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కెటిఆర్‌ను అధికారం పోయిందన్న

# బాధ వెంటాడుతోంది: సీతక్క

**- ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందని వెల్లడి**




**తెలంగాణ వీణ/హైదరాబాద్:** మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కెటిఆర్‌ను అధికారం పోయిందన్న బాధ వెంటాడుతోందని మంత్రి సీతక్క బుధవారం ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పాలకులకు ఇప్పుడు అసలు ఆట ఉందని, అలవిగాని హామీలు ఇచ్చారంటూ అంతకుముందు కెటిఆర్ విమర్శలు గుప్పించారు. కెటిఆర్ వ్యాఖ్యలపై సీతక్క ఘాటుగా స్పందించారు. బిఆర్ఎస్ నాయకులకు అంత తొందరపాటు పనికి రాదన్నారు. అధికారం పోయిందన్న బాధ వారిలో కనిపిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు.ఎన్నికల ప్రచారం సయమంలో తాము ఇచ్చిన హామీలకు.. బిఆర్ఎస్ జోడించి చెప్పారని గుర్తు చేశారు. అలాంటప్పుడు వారు ఎలా ప్రశ్నిస్తున్నారని, ఇచ్చిన ప్రతి హామీని తాము నెరవేరుస్తామని వ్యాఖ్యానించారు. ఒక్కో హామీని అమలు చేసుకుంటూ వస్తున్నామని తెలిపారు. రైతులకు ఇచ్చిన మాటను కచ్చితంగా నిలబెట్టుకుంటామన్నారు. కాంగ్రెస్ గెలిచిందని ప్రజలంతా సంతోషపడుతున్నారని చెప్పారు.

# సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన సిపిఆర్వో అయోధ్యరెడ్డి



**తెలంగాణ వీణ/హైదరాబాద్:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ముఖ్య ప్రజా సంబంధాల అధికారిగా నియమితులైన బి. అయోధ్యరెడ్డి బుధవారం ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ధన్యవాదాలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి సిఎం కార్యాలయంలో సిపిఆర్వోగా నియమించినందుకు హర్షం వ్యక్తం చేశారు.

# కేంద్ర సర్వీసుల్లోకి స్మిత సబర్వాల్!



**తెలంగాణ వీణ/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి స్మితా సబర్వాల్ కేంద్ర ప్రభుత్వ సర్వీసుల్లోకి వెళ్లేందుకు సిద్ధపడ్డారు. ఈ మేరకు స్మిత దరఖాస్తు కూడా పెట్టుకున్నట్టు తెలుస్తోంది. టీఆర్ఎస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి కార్యదర్శిగా , ముఖ్యంత్రి కార్యాలయ కార్యదర్శిగా కొనసాగుతూ వచ్చింది. కాళేశ్వరం ప్రాజెక్టుతోపాటు మిషన్ భగీరథ ప్రాజెక్టు అమలుకు ఇంఛార్జిగా వ్యవహరించింది. ఆమెకు అసెంబ్లీ ఎన్నికలకు ముందుగా అప్పటి ప్రభుత్వం నీటిపారుదల శాఖ కార్యదర్శి బాధ్యతలు కూడా అప్పగించింది.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావటంతో స్మిత ఉనికి ప్రశ్నార్థకంగా మారింది .ఇటీవల రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నీటిపారుదల శాఖపై ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యదర్శి స్మిత సబర్వాల్ నేతృత్వంలో జరగాల్సిన ఈ కీలక సమావేశానికి ఆమె హాజరుకాలేదు. ఈఎన్సీ అధ్వర్యంలోనే సమీక్ష సమావేశం ముగిసింది. కొత్త ప్రభుత్వంలో ఎక్కడా కనిపించని స్మిత సబర్వాల్ తెలంగాణ రాష్ట్ర నుంచి కేంద్ర సర్వీసులకు వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తుందన్న వార్తలు ఐఎఎస్ వర్గాల్లో చక్కర్లు కొడుతున్నాయి.స్మిత ఇటీవల ట్విట్టర్‌లో చేసిన వ్యాఖ్యలు కూడా అదే విధంగా ఉన్నాయి. తన 23ఏళ్ల కేరీర్‌ను ప్రస్తావించారు. తాను కొత్త చాలెంజ్‌లకు ఎప్పుడూ సిద్ధంగానే ఉన్నట్టు తెలిపారు. మీ అందరి ప్రేమాభిమానాలకు ధన్యవాదాలు అంటూ స్మిత ట్విట్టర్‌లో వ్యాఖ్యానించారు.

# హెూం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలి : నిరంజన్



**తెలంగాణ వీణ/హైదరాబాద్ :** ప్రధాని నరేంద్ర మోడీ పాలనలో దేశంలో భద్రత లేకుండా పోయిందని టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ విమర్శించారు. బుధవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిరంజన్ మాట్లాడారు. పార్లమెంట్ లోకి ఇద్దరు ఆగంతకులు చొరబడి దాడులు చేసే ప్రయత్నం చేశారంటే భద్రత వైఫల్యం ఎంత ఘోరంగా ఉందో అర్థమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో మోడీ పాలన డొల్లతనం బయటపడిందని దుయ్యబట్టారు. ఇంత కట్టుదిట్టమైన భద్రత ఉన్న పార్లమెంట్ లోనే ఇలా ఉంటే దేశంలో పరిస్థితి ఎలా ఉంటుందో అర్థమవుతోందన్నారు. ఈ విషయంలో హెూమ్ శాఖ మంత్రి అమిత్ షా బాధ్యత వహించాలని తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని నిరంజన్ డిమాండ్ చేశారు.

# స్పీకర్ పదవికి గడ్డం ప్రసాద్‌కుమార్ నామినేషన్ దాఖలు...



**తెలంగాణ వీణ/హైదరాబాద్:** తెలంగాణ శాసనసభ స్పీకర్ పదవికి గడ్డం ప్రసాద్ కుమార్ నామినేషన్ వేశారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క పాల్గొన్నారు. వారితో పాటు ఎమ్మెల్యేలు కెటిఆర్, కూనంనేని సాంబశివరావు, హరీశ్ రావు కూడా హాజరయ్యారు. సభాపతిగా గడ్డం ప్రసాద్ కుమార్ ఏకగ్రీవ ఎన్నికకు బిఆర్ఎస్, ఎంఐఎం, సీపీఐ పార్టీ మద్దతిచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ప్రసాద్ కుమార్ పేరును ప్రతిపాదిస్తూ నామినేషన్‌పై కెటిఆర్ సంతకం చేశారు. అయితే ఈ ఎన్నికకు బిజెపి మాత్రం దూరంగా ఉంది. రేపు ఉదయం శాసనసభాపతి ఎన్నిక జరగనుంది. ప్రసాద్ కుమార్ ప్రస్తుతం వికారాబాద్ ఎమ్మెల్యేగా గెలిచిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ పాలనలో దళితులకు పెద్దపీట వేస్తున్నామనే నేపథ్యంలోనే గడ్డం ప్రసాద్ కుమార్ను స్పీకర్‌గా ఎంపిక చేసినట్లు సమాచారం. సభాపతిగా నియమితులైతే రాష్ట్రానికి తొలి దళిత స్పీకర్ ఆయనే కానున్నారు.


# భూకబ్జా ఆరోపణలతో మాజీ మంత్రి మల్లారెడ్డిపై చీటింగ్ కేసు



**తెలంగాణ వీణ/హైదరాబాద్:** మాజీ మంత్రి, మేడ్చల్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డిపై శామీర్ పేట పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. గిరిజనుల భూములు కబ్జా చేశారని ఫిర్యాదు మేరకు 420 చీటింగ్ కేసుతో పాటు ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదు చేశారు. 47 ఎకరాల భూమిని మల్లారెడ్డి కబ్జా చేశారని ఫిర్యాదులో బాధితులు పేర్కొన్నారు. ఎన్నికలు జరగుతున్న సమయంలో రాత్రికి రాత్రే రిజిస్ట్రేషన్ చేశారని ఆరోపించారు. మల్లారెడ్డికి సహకరించిన ఎమ్మార్వో పైనా ఫిర్యాదు చేయటంతో నాలుగు సెక్షన్ల కింద పోలీసులు కేసులు నమోదు చేశారు. మల్లారెడ్డితో పాటు అతని అనుచరులు ఆరుగురిపై 420 చీటింగ్ కేసుతో పాటు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ మల్కాజిరి జిల్లా చింతలపల్లి మండలంలోని కేశవరం గ్రామంలోని సర్వే నెంబర్ 33, 34, 35లో గల 47 ఎకరాల 18 గుటల ఎస్టీ (లంబాడీల) వారసత్వ భూమిని మాజీ మంత్రి మల్లారెడ్డి, అతని బినామీ అనుచరులు 9 మంది అక్రమంగా కబ్జా చేసి, కుట్రతో మోసగించి భూమిని కాజేశారని శామీర్‌పేట పోలీస్టేషన్‌లో కేతావత్ బిక్షపతి అనే వ్యక్తి ఫిర్యాదు చేశాడు. ఎన్నికల సమ యంలో రాత్రికి రాత్రే భూమి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు. మాజీ మంత్రి మల్లారెడ్డి, అతని అనుచరులు శ్రీనివాస్ రెడ్డి, కేశవాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ భర్త గోనె హరి మోహన్ రెడ్డి, శామీర్‌పేట్ మండ ల వ్యవసాయ సహకార సేవా సంఘం చైర్మన్ రామిడి మధుకర్ రెడ్డి, స్నేహ రామిరెడ్డి, రామిడి లక్ష్మమ్మ, రామిడి నేహా రెడ్డిలపై శామీర్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు మంత్రితో పాటు ఆరుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ 420 చీటింగ్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. శామీర్ పేట ఎమ్మార్వో పాత్రపైనా ఆరా తీస్తున్నట్లు చెప్పారు.

# నిజమైన నాయకత్వం సవాలు సమయాల్లో కూడా ప్రకాశిస్తుంది

**- కెసిఆర్ త్వరగా కోలుకొని నాయకత్వం వహించాలి : ఎంపి సంతోష్ ఆశాభావం**



**తెలంగాణ వీణ/హైదరాబాద్ :** నిజమైన నాయకత్వం సవాలు సమయాల్లో కూడా ప్రకాశిస్తుందని రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్ కుమార్ అన్నారు. ప్రశంసనీయమైన అంకితభావం, స్థితిస్థాపకత. మన మహానేత కెసిఆర్ పెద్ద శస్త్రచికిత్స తర్వాత త్వరగా కోలుకోవాలని కోరుకుంటు న్నానని, అతనిని పఠనంలో లీనమై, జ్ఞానం పట్ల అతని అభిరుచిని ప్రదర్శిస్తుందని వెల్లడించారు. 'మా ఆలోచనలు మీతో ఉన్నాయి', మీరే మా ప్రేరణ, త్వరగా కోలుకొని కెసిఆర్ నాయకత్వం వహించాల'ని ఎంపి సంతోష్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో పఠనంలో లీనమై ఉన్న కెసిఆర్ ఇమేజ్‌లను సైతం ఎంపి సంతోష్ తన ట్విట్టర్‌లో పొందుపర్చారు.





# వైయస్సార్ ఆరోగ్యశ్రీ కింద అర్హులకు
# రూ. 25 లక్షల వరకూ చికిత్స ఉచితం

**- నాణ్యమైన విద్య, వైద్యం ప్రజలకు హక్కుగా అందించడం ప్రభుత్వ బాధ్యత.. సీఎం జగన్**

**- ఈ నెల 18న ప్రారంభోత్సవం..**



**తెలంగాణ వీణ/అమరావతి ప్రతినిధి:** వైద్య ఆరోగ్య శాఖ సమీక్షలో సీఎం జగన్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో అర్హులైన వారికి వైయస్సార్ ఆరోగ్య శ్రీ కింద రూ.25 లక్షల వరకూ ఉచిత చికిత్స కార్యక్రమాన్ని చేపట్టింది. ఎవరికి ఎలాంటి వైద్యం అవసరమైనా రూ.25 లక్షల వరకూ చికిత్స ఉచితంగా లభిస్తుందన్న భరోసా ఇవ్వాలనే లక్ష్యంతో కార్యక్రమం సాగాలని సీఎం జగన్ పేర్కొన్నారు. ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యాన్ని ప్రభుత్వం ప్రజలకు హక్కుగా అందించాలనే లక్ష్యంతో అత్యంత మానవీయ దృక్పథంతో అడుగులు వేస్తోందని సీఎం జగన్ పేర్కొన్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్ బుధవారం నాడు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వైయస్సార్ ఆరోగ్య శ్రీ వైద్య సేవల పరిమితిని రూ. 25 లక్షలకు పెంచిన అనంతరం సీఎం జగన్ అధికారులకు కీలక ఆదేశాలిచ్చారు. వైయస్సార్ ఆరో గ్య శ్రీ కార్డు ఉందంటే.. ఆ వ్యక్తికి రూ.25 లక్షలు వరకూ వైద్యం ఉచితంగా లభిస్తుందని వివరించారు. ఆరోగ్యం, విద్య అన్నవి ప్రజలకు ఒక హక్కుగా లభించాలని, ఈ హక్కులను కాపాడటం ప్రభుత్వం బాధ్యతగా తీసుకుందని పేర్కొన్నారు. అందుకనే అధికారంలోకి వచ్చిన రోజునుంచే ప్రభుత్వం ఈ అంశాలపై విశేష కృషి చేసిందని, వైయస్సార్ ఆరోగ్య శ్రీ కింద ప్రభుత్వంచేస్తున్న ఖర్చులే దీనికి ఉదాహరణ అని సీఎం జగన్ పేర్కొన్నారు.

### న్యాణ్యమైన వైద్యానికి భరోసాగా వైయస్సార్ ఆరోగ్య శ్రీ

ప్రజలకు ఆరోగ్య పరంగా ఎలాంటి సమస్యలు వచ్చినా సరే వైయస్సార్ ఆరోగ్యశ్రీ అండగా నిలుస్తుందని సీఎం జగన్ పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీలో చికిత్స చేయించుకున్న వారికి మళ్లీ డాక్టర్ దగ్గరకు వెళ్లి చెకప్ చేయించుకునేందుకు(ఫాలో అప్ కన్సల్టేషన్) రవాణా ఛార్జీల కింద రూ.300 చెల్లించాలని సమీక్షలో సీఎం ఆదేశించారు. ఆరోగ్య సురక్ష క్యాంపుల్లో రోగులుగా గుర్తించిన వారికి ఆస్పత్రులకు వెళ్లేందుకు రూ.500లు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. వైయస్సార్ ఆరోగ్య శ్రీ కింద ఉచితంగా వైద్యం పొందడం ఎలా? అన్నదానిపై రూపొందించిన వీడియోను అందరికీ పంపించాలని అధికారులకు ఆదేశించారు. ఆరోగ్య సిబ్బంది, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది సహా ప్రజలందరికీ కూడా ఈ వీడియోను అందుబాటులో ఉంచాలని సూచించారు. దీంతో పాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేసే స్పెషలిస్టు డాక్టర్లకు అవసరమైన చోట క్వార్టర్లను నిర్మించాలని సీఎం జగన్ ఆదేశించారు.

### 18న సీఎం జగన్ చేతుల మీదుగా వైయస్సార్ ఆరోగ్య శ్రీ ప్రారంభం

ఈ నెల 18న వైయస్సార్ ఆరోగ్య శ్రీ కింద రూ.25 లక్షల వరకూ వైద్యం ఉచితం కార్యక్రమం ప్రారంభించనున్నారు. 19న ప్రతి నియోజకవర్గంలో 5 గ్రామాల చొప్పున జరిగే కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్యేలు పాల్గొనన్నారు. మండలంలో వారానికి నాలుగు గ్రామాల చొప్పున కార్డుల పంపిణీ కార్యక్రమం చేపట్టున్నట్లు అధికారులు సీఎం జగన్ కు తెలిపారు. ప్రతి ఇంటికీ ఆరోగ్యశ్రీకార్డుల పంపిణీ చేపట్టి జనవరి నెలాఖరు నాటికి కార్డుల పంపిణీ పూర్తి చేయనున్నట్లు తెలిపారు. దీంతోపాటు వైయస్సాం ఆరోగ్య శ్రీ కింద ఉచితంగా ఎలా వైద్యం పొందవచ్చున్నదానిపై పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వివరించారు. ఏఎన్ఎం, సీహెచ్ఓ, ఆశావర్కర్లు, వాలంటీర్, మహిళా పోలీసులు ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీ సహా, ఆరోగ్య శ్రీని ఎలా వినియోగించుకోవాలో అవగాహన పెంచే ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. వైయస్సార్ ఆరోగ్య శ్రీ యాప్‌ను డౌన్లోడ్ చేయించి ఎలా వినియోగించాలో వివరిస్తారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా జనవరి 1 నుంచి ఫేజ్-2 ఆరోగ్య సురక్ష జనవరి 1వ తేది ఫేజ్-2 ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభం కానున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ సమీక్షలో సీఎం జగన్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతివారం మండలానికి ఒక గ్రామ సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. అర్బన్ ప్రాంతాల్లో వారంలో ఒక వార్డులో ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించాలని, జిల్లాల్లో సగం మండలాల్లో మంగళవారం, సగం మండలాల్లో శుక్రవారం, అర్బన్ ప్రాంతాల్లో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించాలని సూచించారు. దీంతో పాటు ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ రోగులకు అందుతున్న వైద్య సేవలు రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల్లో కూడా అందించాలని సీఎం జగన్ ఆదేశించారు. స్క్రీనింగ్, మందులు, చికిత్స తదితర అంశాల్లో కిడ్నీ రోగులకు బాసటగా నిలవాలన్నారు. డయాలసిస్ పేషెంట్లు (సీకేడీ) వాడుతున్న మందులు విలేజ్ హెల్త్ క్లినిక్స్‌లో అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఫ్యామిలీ డ్యాక్టర్ కాన్సెప్ట్‌తో అనుసంధానం చేసి మార్కాపురంలో కూడా పలాస తరహా వైద్య చికిత్సా సౌకర్యాలు అందుబాటులోకి రావాలన్నారు. కొత్తగా నిర్మిస్తున్న మెడికల్ కాలేజీలో ఇప్పటికే నెఫ్రాలజీ డిపార్ట్‌మెంట్ కోసం ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని, దీంతో పాటు యూరాలజీ డిపార్ట్‌మెంట్ కూడా తీసుకువచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సీఎం జగన్ ఆదేశించారు.

## ఐఆర్ఆర్ కేసులో చంద్రబాబు ముందస్తు బెయిల్ పిటిషన్ రేపటికి వాయిదా




**తెలంగాణ వీణ/అమరావతి :** అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ముందస్తు బెయిల్ పిటీషన్‌పై విచారణను ఏపీ హైకోర్టు రేపటికి వాయిదా వేసింది. సీఐడీ అధికారుల అభ్యర్థన మేరకు కేసును రేపటికి వాయిదా వేస్తున్నట్లు కోర్టు స్పష్టం చేసింది. ఇన్నర్ రింగ్ రోడ్ కుంభకోణం కేసులో అనేక అక్రమాలు జరిగాయని ఏపీ సీఐడీఅధికారులు చంద్రబాబుపై కేసులు నమోదు చేశారు. ఐఆర్ఆర్ వ్యవహారంలో క్విడ్ ప్రోకో జరిగిందని న్యాయ స్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. భారీ స్థాయిలో ముడుపులు చేతులు మారాయని ఏజీ శ్రీరామ్ న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ముందుస్తు బెయిల్ ఇవ్వాలని చంద్రబాబు ఏపీ హైకోర్టును ఆశ్రయించారు.

## ఏపీలో కేంద్ర బృందం పర్యటన..

**తుఫాను ప్రభావంతో నష్టపోయిన పంటలను పరిశీలించిన సభ్యులు**



**తెలంగాణ వీణ/అమరావతి :** మిగ్‌జాం తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాలో కేంద్ర బృందం బుధవారం పర్యటించింది. తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న పంటలను రాజేంద్ర రత్నూ నేతృత్వంలో బృందంలోని సభ్యులు పరిశీలించారు. కంకిపాడు మండల కేంద్రంలో పంట నష్టంపై ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. దావులూరులో నష్టపోయిన పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్ర పరిశీలకుడు రాజేంద్ర రత్నూ మాట్లాడుతూ కేంద్రం ఆదేశాల మేరకు ఏపీలో తుఫాను ప్రభావంతో పంట నష్టపోయిన ప్రాంతాలను పరిశీలించామని వివరించారు. రెండు రోజుల పాటు రాష్ట్రంలో పర్యటించి పంట నష్టం అంచనాను నివేదిక రూపంలో తయారుచేసి కేంద్రానికి నివేదిస్తామని చెప్పారు. ఇచ్చే నివేదికను కేంద్రం పరిశీలించి పంట నష్టపరిహారాన్ని ప్రకటిస్తుందని వెల్లడించారు.

## ఏపీకి ప్రత్యేక హెూదా ఇవ్వాలి

**- మంత్రి కోమటిరెడ్డి డిమాండ్**



**తెలంగాణ వీణ/హైదరాబాద్:** ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హెూదా ఇవ్వాలని తెలంగాణ ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీకి ప్రత్యేక హెూదా సాధించేందుకు తన వంతు కృషిచేస్తానని తెలిపారు. ఢిల్లీలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లా డుతూ.. ఏపీకి ప్రత్యేక హెూదా ఇస్తామని రాష్ట్ర విభజన సందర్భంగా నాటి ప్రధాని మన్మో హన్‌సింగ్ హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఆ హామీని కేంద్రం ఇప్పటికీ నెరవేర్చక పోవ డం బాధాకరమని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఏపీకి ప్రత్యేక హెూదా ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

## తిరుమలలో తగ్గిన రద్దీ..
## టోకెన్లు లేని భక్తులకు 8 గంటల్లో సర్వదర్శనం

**తెలంగాణ వీణ/తిరుమల:** కలియుగ ప్రత్యక్షదైవం వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు తిరుమలకు భక్తుల రాక తగ్గింది. మూడు రోజులుగా తిరుమల కొండపై భక్తుల తాకిడి పెరుగగా బుధవారం మాత్రం తగ్గుముఖం పట్టింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు రెండు కంపార్టుమెంట్లలో వేచియున్నారు.టోకెన్లు లేని భక్తులకు 8 గంటల్లో సర్వదర్శనం కలుగుతుందని టీటీడీ అధికారులు వెల్లడించారు. నిన్న స్వామివారిని 63,021 మంది భక్తులు దర్శించుకోగా 19,091 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులుసమర్పించుకున్న కానుకల ద్వారాహుండీ ఆదాయం రూ.3.15 వచ్చిందని వివరించారు.

## టీటీడీకి షాక్ ఇచ్చిన ఏపీ హైకోర్టు..
## నిధుల మళ్లింపుపై అభ్యంతరం

**తెలంగాణ వీణ/తిరుమల :** ఏపీ హైకోర్టు తిరుమల తిరుమతి దేవస్థానానికి షాక్ ఇచ్చింది. ఆలయానికి వస్తున్న నిధుల నుంచి తిరుపతి మున్సిపల్ మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ చేయడాన్ని తప్పుపట్టింది. టీటీడీ బోర్డుకు వస్తున్న నిధుల్లో ఒక శాతం తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌కు కేటాయిస్తామని ప్రకటించి అందులో భాగంగా వంద కోట్ల రూపాయలను మున్సిపల్ కార్పొరేషన్‌కు పారిశుద్ధ్య పనులకు మళ్లించింది.చర్య సబబు కాదని పేర్కొంటూ బీజేపీ నాయకుడు భానుప్రకాశ్‌రెడ్డి ఏపీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. బుధవారం కోర్టులో పిటిషన్ కేసు విచారణకు రాగా ఆలయ నిధులు మళ్లించడం దేవాదాయ చట్టం సెక్షన్ 111కు విరుద్ధమని స్పష్టం చేసింది. సంబంధిత కాంట్రాక్టర్లకు సొమ్ము విడుదల చేయొద్దని, టెండర్ ప్రక్రి య కొనసాగించుకోవచ్చని కోర్టు మధ్యంతర ఉత్తర్వుల్లో పేర్కొంది. రెండు వారాల్లోగా టీటీడీ, తిరుపతి మున్సిపల్‌కార్పొరేషన్ కౌంటర్ పిటిషన్‌దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.




## కార్తీక మాసంలో శ్రీ శైల మల్లన్నకు రూ.6.14 కోట్ల ఆదాయం.. !

**తెలంగాణ వీణ/శ్రీశైలం:** శ్రీశైల భ్రమరాంబికా మల్లిఖార్జున స్వామి అమ్మవార్ల హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. ఆలయ ప్రాంగణంలో అక్కమహాదేవి అలంకార మండపంలో పటిష్ఠ నిఘా నేత్రాల మధ్య ఆలయ సిబ్బందితోపాటు శివసేవకులు, ఉభయ దేవాలయాలు, పరివార దేవతాలయాల హుండీలను లెక్కించారు. కార్తీక మాసాంతం 28 రోజులుగా స్వామి అమ్మవార్లకు భక్తులు చెల్లించిన మొక్కులు, కానుకలు నగదు రూపంలో రూ.06,14,22,180 ఆదాయంగా వచ్చినట్లు ఈవో పెద్దిరాజు తెలిపారు. అలాగే, భ్రమరాంబికా మల్లికార్జున స్వామి అమ్మవార్లకు 403.5 గ్రాముల బంగారు ఆభరణాలు, 10 కేజీల వెండి ఆభరణాలు కూడా లభించాయని ఈవో పెద్దిరాజు చెప్పారు. వీటితోపాటు 118 యూఎస్ఏ డాలర్లు, 130 యూఏఈ ధీరమ్స్, 100 యూకే పౌండ్స్, 40 ఆస్ట్రేలియా డాలర్లు, 22 మలేషియా రింగెట్స్, 19 సింగపూర్ డాలర్లు, 20 కెనడా డాలర్లు, పది యూరోలను స్వామి అమ్మవార్లకు భక్తులు మొక్కులుగా హుండీలో సమర్పించినట్లు ఆలయ అధికారులు తెలిపారు.



తెలంగాణ వీణ


నిజం నిగ్గు తేల్చడం..

# జాతీయం





## ప్లాట్‌ఫారంపై కూలిన వాటర్ ట్యాంక్



**తెలంగాణ వీణ/కోల్‌కతా :** పశ్చిమబెంగాల్ బర్ధమాన్ స్టేషన్ రైల్వే ప్లాట ఫారమ్ పై వాటర్ టాంక్ కూలిపోయింది.ఆసమయంలో అక్కడ ఉన్న ప్ర యాణికుల్లో కొందరు గాయపడ్డారు. వారిని బర్ధమాన్ మెడికల్ కాలేజీ, ఆస్పత్రికి పంపారు. ఈ సంఘటనకు సంబంధించి ముగ్గురు ఉద్యోగులను సస్పెండ్ చేశారు. . 1,2, 3 ప్లాట్‌ఫారాల వద్ద రైళ్ల రాకపోకలను తాత్కాలికంగా నిలిపి వేశారు.

## నక్సల్స్ దాడిలో జవాన్ వీర మరణం



**తెలంగాణ వీణ/రాయ్‌పూర్:** ఛత్తీస్‌గఢ్‌లో నక్సల్స్ రెచ్చిపోతున్నారు. నారాయణ్‌పూర్ అమ్‌దై మైన్స్‌లో నక్సల్స్ అమర్చిన ఐఈడీ పేలి ఓ జవాన్ ప్రాణాలు కోల్పోయాడు. మరో సైనికుడు గాయపడ్డాడు. గనుల్లోని పలుచోట్ల ఐఈడీలను అమర్చుతామని నక్సల్స్ హెచ్చరించారు. గతంలో ఐఈడీ పేలుడులో ఇద్దరు కార్మికులు ప్రాణాలు కోల్పోయారు.నక్సల్స్ ఐఈడీ దాడిలో సైనికుడిని కమలేష్ సాహుగా గుర్తించారు. ఆయన స్వస్థలం జంజ్‌గిర్ చంపా జిల్లా హసౌద్ గ్రామం. నారాయణ్‌పూర్ లోని ఛోటెడోంగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అమ్‌దై గనిలో ఉదయం నక్సలైట్లు ఐఈడీని పేల్చడంతో పాటు కాల్పులు జరిపారని బస్తర్ ఐజీ సురందర్ రాజ్ తెలిపారు. నక్సల్స్ దాడిలో సీఎఎఫ్ 9 వ కార్ప్‌కు చెందిన కానిస్టేబుల్ కమలేష్ కుమార్ వీర మరణం పొందారని తెలిపారు. కానిస్టేబుల్ వినయ్ కుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయని చెప్పారు.ఈ సంఘటన తరువాత పరిసర ప్రాంతాల్లోపోలీస్ బలగాలు , డీఆర్‌జీ, ఐటీబీపీ బలగాలు తనిఖీలు నిర్వహించాయి. ఇదిలా ఉండగా ఈనెల 9 న ఛోటాదొంగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ ఆలయంలో పూజలు చేసేందుకు వెళ్లిన బీజేపీ నేత కోమల్ మాఝీని నక్సల్స్ చంపేశారు.మరోవైపు నారాయణ్‌పూర్ గనుల వద్ద మోహరించిన 16 వాహనాలను నక్సల్స్ దగ్ధం చేశారు. పలువురు ఉద్యోగులను బందీలుగా పట్టుకున్నారు.

## లోకమాన్య తిలక్ స్టేషన్‌లో అగ్నిప్రమాదం



**తెలంగాణ వీణ/ముంబై:** ముంబైలోని లోకమాన్య తిలక్ టెర్మినస్ (ఎల్‌టిటి) స్టేషన్ క్యాంటీన్‌లో బుధవారం అగ్నిప్రమాదం జరిగింది. మంటలు స్టేషన్‌లోని బుకింగ్, వెయిటింగ్ హాళ్లను చుట్టుముట్టాయి. స్టేషన్ నుండి ప్రయాణికులను ఖాళీ చేయించి, మంటలను ఆర్పేందుకు అగ్నిమాపక దళానికి చెందిన రెండు వాహనాలు ఘటనాస్థలికి చేరుకున్నాయని అధికారులు తెలిపారు. ఈ ఘటనలోఎవరూ చనిపోలేదని, గాయపడలేదని వారు తెలిపారు.

## పార్లమెంటులో భద్రతావైఫల్యం: లోక్ సభ ఛాంబర్లోకి దూకిన ఆగంతకులు

**తెలంగాణ వీణ/న్యూఢిల్లీ:** పార్లమెంటులో భద్రతావైఫల్యం కొట్టొచ్చినట్లు కనబడింది. బుధవారం లోక్ సభ జరుగుతున్న సమయంలో పబ్లిక్ గ్యాలరీనుంచి ఇద్దరు యువకులు అకస్మాత్తుగా సభలోకి దూకారు. నల్లచట్టాలను రద్దుచేయాలి అంటూ వారు నినాదాలు చేస్తుండగా, కొందరు ఎంపీలు వారిని పట్టుకుని భద్రతా సిబ్బందికి అప్పగించారు. దీంతో సభ వాయిదాపడింది. 2001లో పార్లమెంటుపై ఇదే రోజున దాడి జరిగింది. తిరిగి అదే రోజున ఈ సంఘటన చోటు చేసుకోవడం కలవరం రేకెత్తిస్తోంది. ఈ సంఘటనపై పార్లమెంటు సభ్యుడు కార్తీ చిదంబరం మాట్లాడుతూ "అకస్మాత్తుగా ఇద్దరు యువకులు విజిటర్స్ గ్యాలరీలోంచి సభలోకి దూకారు. వారి చేతిలో ఉన్న పొగడబ్బాలలోంచి పసుపు రంగులో పొగ వెలువడుతోంది. వారిలో ఒకడు స్పీకర్ వైపు వెళ్లేందుకు ప్రయత్నించాడు. ఇది పార్లమెంటులో భద్రతావైఫల్యానికి నిదర్శనం" అని పేర్కొన్నారు.

# పాసుల జారీ వెనుక బిజెపి మైసూర్ ఎంపి ప్రతాప్ సింహా

**తెలంగాణ వీణ/న్యూఢిల్లీ:** స్మోక్ బాంబులతో పార్లమెంట్ లోపలకు ప్రవేశించిన ఇద్దరు వ్యక్తులకు పాసుల జారీకి సిఫార్సు చేసిన ఎంపీ ఎవరన్న విషయమై వాస్తవాలు వెలుగుచూస్తున్నాయి. బుధవారం లోక్‌సభ విజిటర్స్ గ్యాలరీలోకి ప్రవేశించిన ఆ ఇద్దరు వ్యక్తులు అక్కడి నుంచి సభ్యులు కూర్చున్న సీట్ల పైకి దూకి అలజడి సృష్టించిన నేపథ్యంలో వారికి విజిటర్స్ పాసుల అనుమతి వెనుక ఎవరు ఉన్నారన్న విషయాలు వెలుగు చూస్తున్నాయి. బిజెపి ఎంపి ప్రతాప్ సింహ్ కార్యాలయం నుంచే వారికి పాసులు జారీ అయినట్లు బిఎస్‌పి ఎంపి డానిష్ అలీ తెలిపారు.కర్నాటకలోని మైసూరుకు చెందిన ఎంపి ప్రతాప్ సింహా కార్యాలయం నుంచే వారిద్దరికీ పాసులు జారీ అయినట్లు పోలీసులు తెలిపారు. ఆ ఇద్దరు వ్యక్తులలో ఒకరు సింహా ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజవకర్గానికి చెందిన వ్యక్తని వారు చెప్పారు. 35 ఏళ్ల డి మనోరంజన్ మైసూరులోని వివేకానంద్ యూనివర్సిటీ నుంచి బిటెక్ చదివాడు. అతని తండ్రి మైసూరులోని విజయ్‌నగర్‌లో నివిస్తున్నారు. 2014లో మైసూరు నియోజకవర్గం నుంచి 43.46 శాతం ఓట్లు సాధించి గెలుపొందిన సింహా 2019 ఎన్నికలలో తన ఓట్ల వాటాను 52.27 శాతానికి పెంచుకున్నారు. మాజీ జర్నలిస్టు అయిన 42 ఏళ్ల సింహా తన వ్యాసాల ద్వారా పేరు పొందారు.



2007లో ప్రధాని నరేంద్ర మోడీపై జీవిత కథ రాసిన సింహ ప్రధాని మోడీని తాను ఆరాధిస్తానని గతంలో చెప్పారు.బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో డి మనోరంజన్, సాగర్ శర్మ లోక్‌సభ విజిటర్స్ గ్యాలరీ నుంచి ఛాంబర్‌లోకి దూకారు. ఎంపీలు కూర్చునే డెస్కులపైకి దూకిన సాగర్ స్పీకర్ కుర్చీ వూసు పరుగెత్తడం టివి పుటేజ్ చూపింది. ఈ సమయంలో మనోరంజన్ ఒక స్మోక్ బాంబును ప్రయోగించగా పసుపు రంగు పొగ రావడం కనిపించింది. మనోరంజన్ ఎంపి కార్యాలయానికి తరచు వచ్చేవాడని వర్గాలు తెలిపాయి. బుధవారం ఎంపి కార్యాలయానికి వచ్చిన మనోరంజన్ సహ నిందితుడు సాగర్ శర్మను తన మిత్రుడిగా అక్కడి సిబ్బందికి పరిచయం చేశాడని వారు చెప్పారు.కొత్త పార్లమెంట్‌ను చూస్తామన్న నెపంతో సిబ్బంది నుంచి పాసులు పొందాడని వారు తెలిపారు. సింహా తరఫున మూడు పాసులు జారీ చేశారని, అయితే చంటిబిడ్డతో వచ్చిన ఒక మహిళ లోపలకు అనుమతించకపోవడంతో వాపసు వచ్చిందని, ఆమె పేరును పాసులో పేర్కొనలేదని వర్గాలు తెలిపాయి. ఇద్దరు నిందితులతో ఆ మహిళకు ఎటువంటి సంబంధం లేదని వారు చెప్పారు. పాసుల కోసం మూడు నెలలుగా మనోరంజన్ ఎంపిని, ఆయన కార్యాలయ సిబ్బందిని అడుగుతున్నాడని వర్గాలు తెలిపాయి. తమ నియోజకవర్గానికి చెందిన ప్రజల నుంచి అటువంటి విజ్ఞప్తులను ఎంపీలు మన్నించడం సాధారణమేనని ఎంపి కార్యాలయం తమ చర్యను సమర్ధించుకునే ప్రయత్నం చేస్తోంది. ఇలా ఉండగా పార్లమెంట్ వెలుపల రంగుల స్మోక్ బాంబులతో ఉన్న అమోల్ షిండే, నీలం దేవి అనే ఇద్దరు స్త్రీపురుషులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# నాలుగంచెల భద్రతలో వైఫల్యం ఎక్కడ జరిగింది?

**- పార్లమెంట్ లోపలకు స్మోక్ బాంబులు ఎలా వెళ్లాయి?**

**తెలంగాణ వీణ/న్యూఢిల్లీ:** పార్లమెంట్‌లోకి ఇద్దరు దుండగులు ప్రవేశించి అలజడి సృష్టించిన నేపథ్యంలో పార్లమెంట్ వద్ద చొటోచేసుకున్న భద్రతా వైఫల్యాలు కొత్త పార్లమెంట్ వద్ద భద్రతా వ్యవస్థపై అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. గతంతో పోలిస్తే పార్లమెంట్ వద్ద భద్రతా వ్యవస్థ మరింత మరింత పటిష్టం చేసినప్పటికీ స్మోక్ బాంబులతో ఇద్దరు వ్యక్తులు విజిటర్స్ గ్యాలరీలోకి ఎలా ప్రవేశించగలిగారన్న అనుమానాలు తలెత్తుతున్నాయి.2001లో పార్లమెంట్‌పై దాడి జరిగిన తర్వాత పాత పార్లమెంట్ భవనం వద్ద భద్రతను ప్రక్షాళన చేశారు. మూడంచెల భద్రతా వ్యవస్థ స్థానంలో నాలుగు అంచెల భద్రతా వ్యవస్థ అమలులోకి వచ్చింది. పార్లమెంట్ వద్ద ఢిల్లీ పోలీసుకు చెందిన ప్రత్యేక విభాగంతోపాటు సిఆర్‌పిఎఫ్‌కు చెందిన ఒక కంటింజెంట్‌ను ఏర్పాటు చేశారు. సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరీ ఫోర్స్, అగ్నిమాపక దళంతోసహా ఇతర సంస్థలను భద్రతా వ్యవస్థలో మమేకం చేశారు.భద్రతా ప్రక్రియలో భాగంగా పార్లమెంట్ వద్ద సందర్శకులను క్షుణ్ణంగా తనిఖీలు చేయడం జరుగుతుంది. భౌతిక తనిఖీలతోపాటు సందర్శకుల వద్ద ఉండే వస్తువులన్నిటినీ క్షుణ్ణంగా తనిఖీ జరుగుతుంది. ఫోన్లు, బ్యాగులు, నీళ్ల బాటిళ్లతోపాటు చిల్లర నాణేలను సైతం లోపలకు అనుమతించరు. సందర్శకులు తప్పనిసరిగా తమ ఆధార్ కార్డులను చూపించాల్సి ఉంటుంది. మూడు ఫుల్ బాడీ స్కానర్లను దాడుటకునే లోపలకు ప్రవేశం ఉంటుంది. ఈ ప్రక్రియ అంతా పూర్తయిన తర్వాతే సందర్శకులకు పాసులు జారీ చేస్తారు.సందర్శకుడి నేపథ్యాన్ని గురించి ఆరా తీసిన తర్వాత పాసుల జారీ జరుగుతుంది. పార్లమెంట్ సభ్యుడు సంతకం చేసిన సిఫార్సు లేఖలపైనే పాసులు జారీ చేస్తారు. పార్లమెంట్‌లోని విజిటర్స్ గ్యాలరీలోకి ప్రవేశించిన ఆ ఇద్దరు వ్యక్తులు స్మోక్ బాంబులను తమ షూ లోపల దాచి ఉంటారన్న అనుమానాలు



వ్యక్తమవుతున్నాయి. వారిని తనిఖీ చేస్తున్న సమయంలో షూల విషయాన్ని భద్రతా సిబ్బంది విస్మరించి ఉంటారని భావిస్తున్నారు. అయితే ఫుల్ బాడీ స్కానర్లను వారిద్దరూ ఎలా తప్పించుకుని ఉంటారన్నది మాత్రం అంతుచిక్కడం లేదు.

# కాంగ్రెస్ ఎంపి ఇంట్లో నేలమాళిగపై ఐటి నజర్

**- మొత్తం రూ. 465 కోట్ల నగదు 3 బస్తాల బంగారం స్వాధీనం**

**తెలంగాణ వీణ/రాంచి:** కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యుడు, బౌధ్ డిస్టిలరీల యజమాని ధీరజ్ సాహు నివాసంలో సోదాలను ఆదాయం పన్ను శాఖ ఉధృతం చేసింది. భూగర్భంలో ఏవైనా నిధులను దాచిపెట్టారా అన్న కోణంలో ఆలోచిస్తున్న అధికారులు గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్(జిపిఆర్)ను ఉపయోగిస్తూ తమ సోదాలను కనొసాగిస్తున్నారు. చిన్న రంధ్రం పెట్టడం ద్వారా భూమిలోపలకు రేడియో తరంగాలను పంపి అక్కడి ఫోటోలనుతీయడం జిపిఆర్ విధానంలో జరుగుతుంది. నేలను తవ్వకుండా నేలమాళిగ(భూ గర్భంలో)లో ఉన్న వస్తువులను గుర్తించడం ఈ ప్రక్రియ ప్రత్యేకత.సాధారణంగా ఈ యంత్రాన్ని భూమిలోపల నిక్షిప్తమైన బొగ్గు లేదా ఇతర ఖనిజాన్ని గుర్తించడానికి ఉపయోగిస్తారు. ఏదైనా వస్తువు లేదా ఖనిజం కచ్చితంగా భూమిలోపల ఎంతదూరంలో ఉందో దీని ద్వారా గుర్తించవచ్చని సాంకేతిక నిపుణులు చెబుతున్నారు. కాగా ఐదు



రోజులపాటు వరుసగా సోదాలు నిర్వహించిన ఐటి అధికారులు జార?ండ్, ఒడిశాలోని ధీరజ్ సాహుకు చెందిన ప్రాంగణాల నుంచి రూ. 354 కోట్ల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఒడిశాలోని బోలంగిర్‌లో బల్దేవ్ సాహు అండ్ గ్రూప్ ఆఫ్ కంపెనీలకు చెందిన కార్యాలయంలోని తొమ్మిది బీరువాల నుంచి రూ. 354 కోట్ల నగదు లభించింది. ఛత్తీస్‌గఢ్‌లో హంగ్ అసెంబ్లీ ఏర్పడే అవకాశం ఉందని ఊహిస్తున్న కాంగ్రెస్ ఎంపి ఎమ్మెల్యేల బేరసారాల కోసం ఈ ధనాన్ని దాచి ఉంచినట్లు అధికారులు అనుమానిస్తున్నారు.మరి కొన్ని తర ప్రాంగణా లనుంచి కూడా భారీ మొత్తంలో నగదును స్వాధీనం చేసుకున్నారు. మూడు బస్తాలలో దాచిన బంగారు నగలు, విలువైన పత్రాలను కూడా ఐటి అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నగదును లెక్కించడానికి మూడు బ్యాంకులకు చెందిన దాదాపు 50 మంది సిబ్బంది కష్టపడాల్సి వచ్చింది. సాహుకు చెందిన ప్రాంగణాల నుంచి మొత్తం రూ. 465 కోట్ల నగదును ఐటి అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు అనధికార వార్తలు చెబుతున్నాయి. జార?ండ్‌లోని లోహర్‌దాగా నివాసి అయిన ధీరజ్ సాహు 1977లో విద్యార్థి నాయకుడిగా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం మూడవ పర్యాయం కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యునిగా కొనసాగుతున్నారు.

## ఘటనపై విచారణ జరిపిస్తా: లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా



**తెలంగాణ వీణ/న్యూఢిల్లీ:** పార్లమెంట్‌లో బుధవారం మధ్యాహ్నం 1.02 గంటలకు జీరో అవర్‌లో ఇద్దరు వ్యక్తులు గుర్తు తెలియని పసుపు రంగు పొగను వెదజల్లుతూ సందర్శకుల గ్యాలరీ నుంచి దూకి లోక్‌సభ ఛాంబర్‌లోకి పరుగెత్తడంతో భద్రతా ఉల్లంఘన జరిగింది. ఈ ఘటనపై విచారణ జరిపించే బాధ్యత తనదని లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా వెల్లడించారు. ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. నిందితులు వదిలిన గ్యాస్ ఏమిటి అనేదానిపై విచారణ చేస్తున్నామన్నారు. ఎంపిల ఆందోళనను పరిగణలోకి తీసుకున్నామని స్పీకర్ తెలిపారు. ఈ ఘటనపై ఇప్పటికే విచారణకు ఆదేశించామని ఆయన వెల్లడించారు. తగిన చర్యలు తీసుకోవాలని ఢిల్లీ పోలీసులను ఆదేశించామన్నారు. విచారణ తర్వాత అన్ని విషయాలు బయటకొస్తామని పేర్కొన్నారు. నిందితుల్లో ఒకరు అమోల్ షిండే కాగా, మరొక మహిళ పేరు నీలమ్ కౌర్ గా గుర్తించారు. నియంతృత్వం ఇక చెల్లరు అంటూ నిందితులు మీడియా ముందు నినాదాలు చేశారు.

## ఛత్తీస్‌గఢ్ సీఎంగా విష్ణుడియో సాయ్ ప్రమాణస్వీకారం



**తెలంగాణ వీణ/రాయ్‌పూర్:** ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రిగా విష్ణుడియోసాయ్ బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. డిప్యూటీ సీఎంలుగా అరుణ్ సావో, విజయ్ శర్మ కూడా ప్రమాణ స్వీకారం చేశారు. రాయ్‌పూర్‌లో జరిగిన ఈ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ప్రధాని నరేంద్రమోడీ, కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా, బీజేపీ చీఫ్ జేపీ నడ్డా, యూపీ సిఎం యోగి ఆదిత్యనాథ్, అసోం సీఎం హిమంత బిస్వాశర్మ, ఛతీస్‌గఢ్ మాజీ సీఎం భూపేష్ భగేల్‌తోపాటు పలువురు నాయకులు హాజరయ్యారు. విష్ణుడియో సాయ్ గతంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా పనిచేశారు. అంతేగాక ప్రధాని నరేంద్రమోడీ తొలి క్యాబినెట్‌లో కేంద్రమంత్రిగా కూడా పనిచేశారు.

## శాంతి భద్రతల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు: సీపీ సుధీర్ బాబు

**- మహిళా సంరక్షణ, సిబ్బంది సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ..**



**తెలంగాణ వీణ/మల్కాజిగిరి:** రాచకొండ కమిషనరేట్ నూతన కమిషనర్‌గా సుదీర్ బాబు భాద్యతలు చేపట్టారు. బుధవారం నేరేడ్మెట్ లోని రాచకొండ కమిషనరేట్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, కార్యాలయ సిబ్బంది కమిషనర్ కు ఘన స్వాగతం పలికారు. కమిషనరేట్ పరిధిలో పని చేస్తున్న డీసీపీ, ఏసీపీలు, అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ సుధీర్ బాబు మాట్లాడుతూ రాచకొండ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం అవసరమైన చర్యలు తీసుకుంటామనీ, ట్రాఫిక్ సమస్యలు, నేర నియంత్రణకు కృషి చేస్తామన్నారు. మహిళా సంరక్షణ కోసం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని, షీ టీమ్స్ బృందాలను మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. డ్రగ్స్ సరఫరా , వినియోగం పై మీద ఉక్కుపాదం మోపుతామనీ, యువత మత్తు పదార్థాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. డిజిటల్ యుగంలో పెరుగుతున్న సైబర్ నేరాలను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని, ప్రజలలో సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించేలా పలు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. గతంలో రాచకొండ అదనపు కమిషనర్ గా పని చేసిన అనుభవంతో రాచకొండ పరిధిలోని అన్ని ప్రాంతాల మీద సంపూర్ణ అవగాహన ఉందని, మూడు కమిషనరేట్లతో సమన్వయంతో కలిసి పనిచేస్తూ , ప్రజలకు ఎల్లవేళలా సేవలందిస్తామన్నారు. నేరాలను అరికట్టడంలో అందరితో కలిసికట్టుగా పనిచేస్తామని, పోలీస్ సిబ్బంది సంక్షేమంపై కూడా దృష్టి సారిస్తామన్నారు. భూ సంబంధ నేరాలపై ప్రత్యేక ద్రుష్టి సారిస్తామని, రౌడీ షీటర్స్ పై ఎప్పటికప్పుడు నిఘా ఉంటుందని తెలిపారు. ప్రజలు నేర భయం లేకుండా ఉండాలంటే అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి నేరాలను అదుపు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాచకొండ అడిషనల్ సీపీ సీపీ తరుణ్ జోషి, మల్కాజిగిరి డీసీపీ ధరావత్ జానకి , మహేశ్వరం డీసీపీ శ్రీనివాస్, ఎల్బీనగర్ డీసీపీ సాయి శ్రీ, ఉమెన్ సేఫ్టీ డీసీపీ ఉషా విశ్వనాథన్ , రోడ్ సేఫ్టీ డీసీపీ శ్రీబాల, డీసీపీ క్రైమ్స్ అరవింద్, డీసీపీ అడ్మిన్ ఇందిరా లు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి మల్లారెడ్డిపై కేసు నమోదు..



**తెలంగాణ వీణ/మేడ్చల్ ప్రతినిధి:** తెలంగాణ మాజీ మంత్రి సీహెచ్ మల్లారెడ్డి మీద పోలీసు కేసు నమోదైంది. శామీర్‌పేట్ పోలీస్ స్టేషన్ లో ఎస్సీ,ఎస్టీ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు . గంగా రామ్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు రిజిష్టర్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. గిరిజనులకు చెందిన భూమిని తమ పేరు మీద బలవంతంగా రాయించుకునేందుకు ప్రయత్నం చేసిన మల్లారెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈ వ్యవహారానికి సహకరించిన శామీర్‌పేట్ తహశీల్దార్ పై సైతం కేసు నమోదు అయ్యినట్లు పోలీసులు పేర్కొన్నారు. గతంలోనూ మల్లారెడ్డిపై పలు కేసులు నమోదయ్యాయి. భూ కబ్జాకు సంబంధించి బాధితురాలు ఫిబ్రవరిలో కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు. మల్లారెడ్డికి చెందిన రెండు ఆస్పత్రుల మధ్యలో ఉన్న భూమిని కబ్జా చేసేందుకు యత్నించారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇతరుల భూమిని ఆక్రమించడమే కాకుండా వాటికి నకిలీ పత్రాలు సృష్టించి మంత్రి, తమ ల్యాండ్‌లోకి తమనే అడుగు పెట్టనివ్వకుండా అడ్డుకున్నారని ఆరోపణలు ఉన్నాయి. మేడ్చల్ జిల్లా మూడుచింతలపల్లి మండలం కేశవరం గ్రామంలోని సర్వే నెంబర్ 33,34,35లోని సుమారు 47 ఎకరాల 18 గుంటల గిరిజనుల భూములను కబ్జా చేశారని గతంలో శామీర్ పేట పోలీస్ స్టేషన్లో మాజీ మంత్రి మల్లారెడ్డి అతని అనుచరులు శ్రీనివాస్ రెడ్డి,హరిమోహన్ రెడ్డి,మధుకర్ రెడ్డి,శివుడు,స్నేహ రామిరెడ్డి,రామిడి లక్ష్మమ్మ,రామిడి నేహారెడ్డి లపై శామీర్ పేట పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేశారు. పిర్యాదు పై స్పందించిన పోలీసులు వారిపై కేసు నమోదు చేసుకొని ఎఫ్ఐఆర్ కాపీని బాధితులకు అందజేశారు. ఎఫ్ఐఆర్ కాపీలో చామకూర మల్లారెడ్డి అని ఇంటి పేరు లేకపోవడం అలాగే వారి అనుచరుల ఇంటి పేర్లతో కేసు నమోదు చేయకపోవడం వల్ల శామీర్ పేట పిఎస్ ముందు బాధితులు ఆందోళనకు దిగారు.

## మలబార్ గోల్డ్ షోరూంలో "మైన్ డైమండ్" షోను ప్రారంభించిన డా.ప్రీతిరెడ్డి





**తెలంగాణ వీణ/కాప్రా:** ఏ.ఎస్.రావు నగర్ లోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ షోరూంలో "మైన్ డైమండ్" షోను ప్రారంభించారు. బుధవారం మాజీ మంత్రి మల్లారెడ్డి కోడలు, మల్లారెడ్డి హెల్త్ సిటీ డైరెక్టర్ డా.ప్రీతిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై "మైన్ డైమండ్" షో వజ్రాభరణాల ప్రదర్శనను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మైన్ డైమండ్ షోను ప్రారంభించడం గొప్ప అనుభూతిని ఇచ్చిందన్నారు. మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ షోరూంలో నగలు, వజ్రాభరణాలు నాణ్యత, మన్నికతో కూడినవని మహిళలను, యువతులను ఇట్టే ఆకర్షిస్తాయని తెలిపారు. ఈ "మైన్ డైమండ్" షోలో రోజూ ధరించే నగలు, వివాహ ఆభరణాలు, లైట్ వెయిట్ ఆభరణాలు, పురుషుల ఆభరణాలు మరియు ప్లాటినం ఆభరణాల సముదాయాన్ని అందిస్తున్నామనీ, ఈ నెల 13 నుంచి 17 డిసెంబర్ వరకు ఈ మైన్ డైమండ్ షో కొనసాగుతుందని షోరూం హెడ్ షిహాబ్ తెలిపారు. ఖచ్చితమైన తయారీ ధర, రాళ్ల బరువు, నికర బరువు మరియు ఆభరణాల రాళ్ల విలువతో కూడిన పారదర్శక ధరల పట్టి, ఆభరణాలకు జీవితకాల ఉచిత నిర్వహణ, పాత బంగారు ఆభరణాలను తిరిగి విక్రయించేటప్పుడు బంగారానికి 100 శాతం విలువ మరియు బంగారం మార్పిడిపై శూన్య తగ్గింపు, నూరు శాతం బి.ఐ.ఎస్ హాల్ మార్కుతో ధృవీకరించబడిన స్వచ్ఛమైన హెచ్యుఐడీ బంగారం, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా 28 పాయింట్ల నాణ్యత పరీక్షలు నిర్వహించిన ఐజిఐ మరియు జిఐఎ ధృవీకరించిన వజ్రాభరణాలు, బైబ్యాక్ గ్యారెంటీ, నాణ్యతను తనిఖీ చేయడానికి క్యారెట్ ఎనలైజర్, జీవితకాల నిర్వహణ మరియు బాధ్యతాయుతమైన మూలాల నుండి బంగారం సేకరణ వంటి వాగ్దానాలను అందిస్తుందన్నారు. మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ అతి వేగంగా పెరుగుతున్న నమ్మకమైన జ్యూవెలరీ బ్రాండ్ అని మలబార్ గ్రూప్ కి సంబందించిన మూలమైన సంస్థ, ఈ సంస్థ తమ వార్షిక ఆదాయంలో నుంచి గణనీయమైన వాటిని సామాజిక సంస్థాగత బాధ్యత రూపంలో ఆరోగ్యం, ఉచిత విద్య, నిరుపేదలకు గృహ నిర్మాణం, మహిళా సాధికారిత, ఇంకా పర్యావరణ రక్షణ విభాగాలలో తమవంతు సాయం అందిస్తుందన్నారు. మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ఆభరణాల విక్రయ వ్యాపారంలో ఒక ప్రత్యేకత ఏర్పరచుకుంటూ ఇండియా, యూ.కె, యు.ఎస్.ఎ, సింగపూర్, మలేషియా, యు.ఎ.ఇ, ఖతర్, కె.ఎస్.ఎ, ఒమన్, కువైట్, బహ్రెయిన్ దేశాలలో 335కి పైగా షోరూములతో విస్తరించుకొని ముందుకు సాగుతుందని స్టోర్ హెడ్ షిహాబ్ వివరించారు. ఈ కార్యక్రమంలో గౌతమ్, సంతోష్ రెడ్డి, భాస్కర్‌లు పాల్గొన్నారు.

## పార్టీలో పనిచేసిన వారికి తగిన గుర్తింపు: పరమేశ్వర్ రెడ్డి



**తెలంగాణ వీణ/ఉప్పల్:** పార్టీలో పనిచేసిన వారికి తగిన గుర్తింపు వస్తోందని ఉప్పల్ నియోజకవర్గ ఏ బ్లాక్ ఇంచార్జీ పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటూ, నియోజకవర్గ అభివృద్ధిలో తన వంతు కృషి చేస్తానన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవత ఉప్పల్ ను అభివృద్ధి పర్చుకుందామన్నారు. ఎన్నికల ఫలితాలపై బుధవారం మల్లాపూర్ డివిజన్ పరిధిలోని విఎన్ ఆర్ గార్డెన్ లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. పార్టీలో కష్టపడి పనిచేసిన వారిని అదిష్ఠానం గుర్తించి తగిన ప్రాధాన్యత కల్పిస్తోందన్నారు. రాష్ట్రంలో పార్టీని అధికారంలో తీసుకొచ్చిన ప్రజలకు నాయకులు, కార్యకర్తలు అండగా ఉంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వారికి చేరువగా తీసుకెళ్లాలన్నారు. ఇచ్చిన హామీలను అమలు పర్చడంలో ముందుగానే రెండు గ్యారేంటీలను అమలు చేస్తోందని రానున్న వంద రోజుల్లో హామీలన్ని ప్రభుత్వం నెరవేరుస్తోందన్నారు. కాప్రా డివిజన్ కార్పొరేటర్ స్వర్ణరాజ్, రాఘవ రెడ్డి, అంజిరెడ్డి, సీతారాం రెడ్డి, కృష్ణ రెడ్డి, జలగం వెంకటేష్, రాజేందర్, నెమలి అనిల్ కుమార్, పతికుమార్, అంజయ్య, యాదగిరి, సుదర్శన్, సద్గుణ, గట్టయ్య,రాజేష్, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## ఎయిర్ పోర్టుకు ప్రతి 15 నిమిషాలకో బస్సు




**తెలంగాణ వీణ/హైదరాబాద్:** రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టుకు 15 నిమిషాలకు బస్సు నడపనున్నారు. దీనిపై ఆర్‌టిసి ప్రత్యేక దృష్టి సారించింది. 49 పుష్పకం ఏసీ బస్సులను నాలుగు రూట్లలో 24 గంటల పాటు నడపనున్నారు. ఎయిర్ పోర్టుకు వెళ్ళే వారు రూ.5260 తో నెలవారీ బస్‌పాస్‌ను తీసుకుంటే రోజు పుష్పక్ బస్సుల్లో తమ గమ్యస్థానాలకు చేరుకోవచ్చని అధికారులు తెలిపారు. పుష్పక్ బస్సుల్లో రూ,300 చార్జీతో బస్ టికెట్ తీసుకున్న ప్రయాణికులు మూడు గంటల పాటు ఆ టికెట్‌తో సిటి బస్సుల్లో తిరగవచ్చని చెబుతున్నారు. మియాపూర్ ఎక్స్‌రోడ్, జెబిఎస్,సికింద్రాబాద్‌ల నుంచి పుష్పక్ ఏసీ బస్సుల ఆపరేషన్‌ను అధికారులు నిర్వహిస్తున్నారు. మియాపూర్ నుంచి ఎయిర్ పోర్టుకు 90 నిమిషాల్లో బస్సు చేరుకుంటుందని అధికారులు చెబుతున్నారు.

## ఇక ఇంటికే పోస్టల్ సేవలు...

**- హైదరాబాద్‌లో అందుబాటులోకి క్లిక్ ఎన్ బుక్ సేవలు**

**తెలంగాణ వీణ/హైదరాబాద్ :** పోస్టల్ సేవలు మరింత సులభతరం అయ్యాయి. పోస్టాఫీసుకు వెళ్ళకుండానే ఇంటి నుండే సేవలు పొందే వెసులు బాటు హైదరాబాద్‌లో అందుబాటులోకి వచ్చింది. పార్సిళ్లు పోస్టు చేయాలంటే ఇక పోస్ట్ ఆఫీస్‌కు వెళ్ళాల్సిన అవసరం ఉండదు. ఇంటి నుండే వీటిని పంపించవచ్చు. హైదరాబాద్‌లో ఇప్పుడు ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయి. భారతీయ తపాలా శాఖ 'క్లిక్ ఎన్ బుక్' పేరుతో కొత్తగా ఆన్‌లైన్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. ఈ ఆన్‌లైన్ సేవల ద్వారా ఇకపై ఇంటి నుంచే స్పీడ్ పోస్ట్, రిజిస్టర్డ్ లెటర్స్ సహా పార్సిళ్ళు పంపించడానికి వీలవుతుంది. ఆధునాతన సాంకేతికతను తపాలా శాక ఉపయోగించుకుంటోంది.దీని ద్వారా కస్టమర్ ఫ్రెండ్లీగా, హై-టెక్ సర్వీసులను అందించే ప్రయత్నం చేస్తోంది. అందులో భాగంగానే 'క్లిక్ ఎన్ బుక్' సర్వీసును హైదరాబాద్ నగర వాసులకు అందుబాటులోకి తెచ్చింది. ఈ 'క్లిక్ ఎన్ బుక్' సర్వీస్ ఉత్తర ప్రదేశ్, ప్రయాగ్ రాజ్ జిల్లాలోని ప్రయాగ్ రాజ్, కచ్చరీ హెడ్ పోస్ట్ ఆఫీసుల్లో మాత్రమే అందుబాటులోకి రాగా తాజాగా హైదరాబాద్‌లోని పోస్టాఫీసుల్లోనూ అందుబాటులోకి తెచ్చారు. పోస్టు ఆఫీసుకు వెళ్లకుండానే గరిష్టంగా 5 కెజీల బరువు వరకు స్పీడ్ పోస్ట్, రిజిస్టర్ పోస్ట్, పార్సిల్స్‌ను పంపించుకోవచ్చు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలనుకుంటే ముందుగా పోస్టల్ విభాగం అధికారిక




వెబ్‌సైట్ www.indianpost.gov.inలో వ్యక్తిగత వివరాలను నమోదు చేసి రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుంది. వివరాలు నమోదు చేసిన వెంటనే ఒక యూజర్ ఐడీ, పాస్వర్డ్ జనరేట్ అవుతాయి. ఈ యూజర్ ఐడీ, పాస్వర్డ్ సహాయంతో www.indianpost.gov.in వెబ్‌సైట్‌లో లాగిన్ అయ్యి స్పీడ్ పోస్టు, రిజిస్టర్డ్ లెటర్స్, పార్సిల్స్ పంపించుకోవచ్చు. ఇలా ఇంటి నుంచే ఒకసారికి గరిష్ఠంగా 5 లెటర్లు పంపించుకోవచ్చు. అయితే వీటి బరువు 5 కేజీల లోపు మాత్రమే ఉండాలి. వినియోగదారులు రూ.500 వరకు బుకింగ్ ఛార్జీలు చెల్లిస్తే.. పోస్టల్ విభాగం మీ పోస్టులను, లేదా పార్సిల్స్ ను పూర్తి ఉచితంగా పికప్ చేసుకుంటారు. ఒక వేళ మీరు చెల్లించిన బుకింగ్ ఛార్జీలు రూ.500 కంటే తక్కువగా ఉంటే రూ.50 వరకు పికప్ ఛార్జీల కింద వసూలు చేస్తారు. ఆదివారం, ప్రభుత్వ సెలవు దినాల్లో కాకుండా ప్రతి రోజు ఉదయం 9.30 గంటలలోపు బుకింగ్ చేసుకుంటే ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటలోపు పికప్ చేసుకుంటారు. ఉదయం తొమ్మిదిన్నర గంటల తరువాత బుకింగ్ చేసు కుంటే మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 4 గంటలలోపు పికప్ చేసుకుంటారు. ఒకవేళ మధ్యాహ్నం 12.30 గంటల తరువాత బుకింగ్ చేసుకుంటే పోస్టల్ సిబ్బంది మరుసటి రోజు పికప్ చేసుకుంటారు.

## సిఎంను కలిసిన హైదరాబాద్ కొత్త కమిషనర్



**తెలంగాణ వీణ/హైదరాబాద్:** అంబేద్కర్ సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ కొత్త పోలీస్ కమిషనర్ గా నియమితులైన కొత్తకోట శ్రీనివాస రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్ కమిషనర్ గా నియమితులైన శ్రీనివాస్ రెడ్డి బుధవారం ఉదయం బాధ్యతలు తీసుకున్నారు.

## ఒక్క రోజే ఆర్టీసీలో 50 లక్షల మంది ప్రయాణం



**తెలంగాణ వీణ/హైదరాబాద్:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన మహాలక్ష్మి పథకం అందుబాటులోకి రావడంతో ఆర్టీసీ బస్సుల్లో సోమవారం ప్రయాణికులు రికార్డు స్థాయిలో ప్రయాణం చేశారు. సోమవారం ఒక్కరోజే 50 లక్షల మందికి పైగా బస్సుల్లో ప్రయాణించినట్లు ఆర్టీసీ ఈడి ముని శేఖర్ తెలిపారు. కార్తిక మాసం చివరి సోమవారం కావడంతో మహిళలు అత్యధికంగా బస్సుల్లో ప్రయాణాలు చేశారు. ఆదివారం 41 లక్షల మంది ప్రయాణించగా సోమవారం 9 లక్షలు పెరిగింది.

## కెసిఆర్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నారు: మంత్రి తుమ్మల



**తెలంగాణ వీణ/హైదరాబాద్:** మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మాజీ సిఎం కెసిఆర్ ను, సహచర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని సైతం తుమ్మల బుధవారం పరామర్శించారు. స్పీకర్ ఎన్నిక నేపథ్యంలో తుమ్మల అసెంబ్లీకి వచ్చారు.

## మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలి

**- తెలంగాణ డి.ఎడ్, బి. ఎడ్ అభ్యర్థుల సంఘం డిమాండ్ - సమావేశానికి హాజరైన ప్రొ.కోదండరాం, బల్మూరి వెంకట్**

**తెలంగాణ వీణ/హైదరాబాద్ :** రాష్ట్రంలో మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని తెలంగాణ డి.ఎడ్, బి. ఎడ్ అభ్యర్థుల సంఘం డిమాండ్ చేసింది. బుధవారం సంఘం అధ్వర్యంలో జరిగిన టిఆర్‌టి అభ్యర్థుల రాష్ట్ర సభకు ప్రొఫెసర్ కోదండరామ్, కాంగ్రెస్ అధికార ప్రతినిధి హర్షవర్ధన్ రెడ్డి,ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షులు బల్మూరి వెంకట్ తదితరులు హాజరయ్యారు. గత ప్రభుత్వం జారీ చేసిన 5,089 టీచర్ పోస్టులకు అదనంగా మిగతా 20 వేల టీచర్ పోస్టులకు అనుబంధ నోటిఫికేషన్ జారీ చేయాలని టీచర్ అభ్యర్థులు కోరారు.ఉపాధ్యాయుల పదోన్నతులతో ముడి పెట్టకుండా వెంటనే రీ నోటిఫికేషన్ జారీ చేసి గతంలో దరఖాస్తు చేయని వారికి దరఖాస్తు చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని అన్నారు. ఆన్‌లైన్ పరీక్షలు కాకుండా ఆఫ్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయ పోస్టులకు పరీక్ష తేదీలు ఖరారు చేసి, నాలుగు నెలలు సమయం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఒయు జెఎసి నాయకురాలు బాలలక్ష్మీ, ప్రొఫెసర్ అశోక్, డి.ఎడ్ బి.ఎడ్ అభ్యర్థుల సంఘం నేతలు రావుల రామ్మోహన్ రెడ్డి, శ్రీను నాయక్, హరీష్,శ్రీనివాస్, వెంకటేష్ అమర్,మధుసూదన్, శ్రీనివాస్ రెడ్డి, మౌనిక, కవితలు హాజరయ్యారు.



## ఉద్యాన వనాల అభివృద్ధికి ప్రాధాన్యం

# ఎన్ఐఆర్‌డి డైరెక్టర్ జనరల్



**తెలంగాణ వీణ/హైదరాబాద్:** వ్యవసాయరంగంలో ఉద్యాన వనాల అభివృద్ధికి, అందుకు అవసరమైన వనరుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని జాతీయ పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి సంస్థ డైరెక్టర్ జనరల్ డా.జి.నరేంద్ర కుమార్ అన్నారు.గ్రామీణాభివృద్ధి కార్యకలాపాలకు ప్రాధాన్యత ఇవ్వడం , ప్రోత్సహించడం, స్థిరమైన కార్యక్రమాన్ని అందించడం అభివృద్ధి పద్ధతులపైన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీ రాజ్, జిబి పంత్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హిమాలయన్ ఎన్విరాన్‌మెంట్ సంస్థలు బుధవారం నాడు అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి.ఎంఓయూపై ఎన్ఐఆర్‌డి రిజిస్ట్రార్ మనోజ్ కుమార్ సంతకం చేశారు. సహజ వనరుల నిర్వహణ, వాతావరణ మార్పు , విపత్తు నిర్వహణ కేంద్రం హెడ్ డాక్టర్ రవీంద్ర గావలి, ఎన్ఐఆర్‌డి డి.జి డా. జి నరేంద్ర కుమార్, స్కూల్ హెడ్స్ డా.కేశవ రావు , డాక్టర్ కతిరేసన్ ప్రొఫెసర్ సునీల్ నౌటియల్, డైరెక్టర్ డాక్టర్ రాకేష్ కుమార్ సింగ్ (అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్), డా. జగదీష్ ఇతర సీనియర్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ముఖ్యమైనఈ ఒప్పందాన్ని యొక్క ఉద్దేశ్యం ప్రతి ఒక్కటి భాగస్వామ్యం చేయడం ద్వారా విభిన్న సహకార కార్యకలాపాలపై దృష్టి పెట్టడం. , వ్యవసాయ-ఆధారిత జీవనోపాధి వ్యూహాలు విలువ గొలుసు అభివృద్ధికి నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్ తో ప్రోగ్రామ్ కన్వర్జెన్స్ ,ఇంటిగ్రేషన్ ద్వారా కార్యక్రమాలు , మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి యొక్క సంయుక్త ప్రయత్నాలను ఉపయోగించడం వంటి కార్యక్రమాలు చేపట్టనున్నారు.గ్రామాన్ని స్థిరీకరించడానికి హామీ చట్టం, జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ ,పంచాయతీలు , గ్రామీణ పర్యాటక ఆలోచనను పునరుజ్జీవింపజేయడం వంటి వాటిని చేపట్టనున్నారు. కొత్త వ్యాపార అవకాశాలను సృష్టించడం ,గ్రామీణ ప్రజలను అన్ని కోణాల్లో ఉద్ధరించడానికి గ్రామీణ సాంకేతిక సముదాయాల ద్వారా సాంకేతికత బదిలీ సామర్థ్యం పెంపుదల, ఉపాధి కల్పన మరియు జీవనోపాధి ఎంపికలు , స్థిరీకరించడం, స్ప్రింగ్‌షెడ్ షెడ్ మేనేజ్‌మెంట్ , విలేజ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ద్వారా గ్రామ పంచాయతీలను ముందుకు తీసుకెళ్లండి వంటి కార్యకలాలపాలను చేపట్టనున్నారు.హిమాలయ ప్రతాలలో ప్రణాళికలు పునరుత్పాదక ఇంధన వనరులకు పరివర్తింపచేసి వాటిని బలోపేతం చేయడం ,వ్యవసాయ రంగంలో ఉద్యానవనాల అభివృద్ధి , ప్రచారం వంటి కార్యక్రమాలకు పాధాన్య ఇవ్వాలని ఈ సందర్భంగా డా.జి.నరేంద్రకుమార్ ఉద్ఘాటించారు .వ్యవసాయ ఆధారిత జీవనోపాధి కార్యకలాపాలను ప్రోత్సహించడంలో రెండు సంస్థలు చాలా ముఖ్యమైనవి అని,అభివృద్ధి, సూక్ష్మ సంస్థల ఏర్పాటుకు కృషి జరగనుందని డైరెక్టర్ జనరల్ పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధిలో అత్యుత్తమ కేంద్రాల నెట్‌వర్క్‌ను రూపొందించే పనికి ఇది దోహదపడుతుందని, ఈ సహకారం పరిశోధన ఫలితాల వ్యాప్తి ప్రక్రియను సులభతరం చేస్తుందని ఆయన అభిప్రయపడ్డారు.యాక్షన్ రీసెర్చ్ ప్రాజెక్ట్‌లు , సీనియర్ ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్యాన్ని పెంపొందించడం ద్వారా సహజ వనరుల నిర్వహణ వ్యూహాలను అభివృద్ధి చేయడంలో జిబిఎన్ఐహెచ్ఇ యొక్క కృషి ఉంటుందన్నారు.సాంకేతిక సామర్థ్యం, బలోపేతం చేయడం ద్వారా గ్రమీణాభివృద్ధి , వికేంద్రీకృత ప్రణాళికలో పిఆర్ఐలు వ్యవస్థాపక అవకాశాలను సృష్టించడం ఎన్ఆర్ఎల్ఎం కింద స్వయం సేవక సంఘాల ద్వారా మార్కెటింగ్ మద్దతు గ్రామీణ జీవనోపాధిని మార్చేందుకు దేశవ్యాప్తంగా సమన్వయంతో పని చేస్తుందని డైరెక్టర్ జనరల్ నరేంద్ర కుమార్ పేర్కొన్నారు.

# వ్యవసాయ కార్పొరేషన్లు సాంకేతికను అందిపుచ్చుకోవాలి

**- రైతులకు ఉపయుక్తంగా కార్యాచరణ చేపట్టాలి**

**- 14 కార్పొరేషన్లపై మంత్రి తుమ్మల సమీక్ష**



**తెలంగాణ వీణ/హైదరాబాద్:** ప్రపంచంవ్యాప్తంగా వస్తున్న మార్పులను అనుగుణంగా ప్రస్తుత పోటీని తట్టుకునేలా సాంకేతికతను అందిపుచ్చుకుని అన్నదాతలకు ఉపయోగపడేలా కార్పొరేషన్లు పనిచేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులకు సూచించారు. బుధవారం సచివాలయంలో వ్యవసాయ అనుబంధ శాఖలపై తుమ్మల సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో వ్వయసాయ రంగానికి చెందిన 14 కార్పొరేషన్ల ఉన్నతాధికారులతో చర్చించారు. టీఎస్ ఆయిల్ ఫెడ్, టీఎస్ ఆగ్రో, మార్క్ ఫెడ్, టీఎస్ డీసీ, టీఎస్ ఎస్ ఓసీఏ, ట్రైబ్స్, హాకా, తదితర కార్పొరేషన్ల అధికారులు హాజరయ్యారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ..కార్పొరేషన్లు విజయవంతంగా రైతులకు సేవలు అందించేందుకు అవసరమైన పద్ధతులను అవలంభించాలన్నారు. పంటల సాగులో ఇతర దేశాలు అనుసరిస్తున్న అత్యాధునిక విధానాలను మనం అలవరుచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇతర దేశాల నుంచి అత్యాధునిక పద్దతులను అందిపుచ్చుకుని రైతులకు లబ్ధిచేకూర్చేలా పనిచేయాలని సూచించారు. కార్పొరేషన్లు కేవలం వ్యాపార దృక్పథంతోనే పనిచేయవద్దని రైతులకు ఉపయోగపడేలా విధానాలు అమలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. పాత పద్దతులకు స్వస్తిపలికి సరికొత్త విధానాలతో రైతులోకానికి ఉపయుక్తంగా ఉండేలా కార్యాచరణ చేపట్టేలా కార్పొరేషన్లు పనిచేయాలన్నారు.ప్రతీ కార్పొరేషన్ సరికొత్త సాంకేతికను అందిపుచ్చుకుని సమర్థంగా పనిచేసేందుకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేయాలని దిశానిర్దేశం చేశారు.కేంద్ర ప్రభుత్వం అందించే పథకాలను అందిపుచ్చుకుని వాటిని సక్రమమైన పద్దతుల్లో అమలు పరిచేలా కార్పొరేషన్లు బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ దిశగా ఇప్పటి వరకు కార్పొరేషన్లు చేసిన కృషి ఏంటో పూర్తి నివేదిక సమర్పించాలని ఆయా కార్పొరేషన్ల అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశించారు. రైతులకు నష్టం జరిగే ఎటువంటి విధానాలకైనా వెంటనే స్వస్తిపలకాలని సూచించారు. ప్రైవేటు కంపెనీలకు లబ్ధిచేకూర్చే యంత్రాలు, ఎరువులను ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రోత్సహించొద్దన్నారు. అన్నిరకాల కార్పొరేషన్ల అభివృద్ధికి వెంటనే ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. వచ్చే ఐదేళ్ల కు అవసరమయ్యేలా ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొచ్చేలా, రైతులు సంతోషంగా ఉండేవిధంగా ప్రణాళిక రూపొందించాలని ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యానశాఖ భూములను వెంటనే శాఖ పరంగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారుల్ని ఆదేశించారు. అన్ని కార్పొరేషన్ల ఆస్తుల జాబితాను సిద్ధం చేయాలన్నారు. ప్రభుత్వ ఆస్తుల్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని పథకాలను రైతులు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. త్వరలోనే కార్పొరేషన్ల పనితీరుపై మరోసారి సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు.

## పెరిగిన చలి తీవ్రత

**తెలంగాణ వీణ/హైదరాబాద్:** తెలంగాణలో చలి రోజు రోజుకు పెరుగుతూ వస్తున్నది. బుధవారం మరింత పెరిగింది. మరో వైపు రాబోయే రెండు మూడు రోజుల పాటు ఇదే పరిస్థితి ఉంటుందని వాతావరణశాఖ హెచ్చరించింది. ఆ తర్వాత తగ్గుతుందని పేర్కొంది. మళ్లీ నెలాఖరున పెరుగుతుందని, చలికి తోడు చలిగాలులు వీస్తాయని అంచనా వేసింది. రాత్రిపూట ఉష్ణోగ్రతలు పడిపోతాయని.. సాధారణం కంటే డిగ్రీ కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. హైదరాబాద్ శివారు



ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 12నుంచి -13 డిగ్రీల మధ్య నమోదవుతాయని తెలిపింది.రాజేంద్రనగర్‌లో12.5, మెదక్‌లో 12.8 డిగ్రీల అత్యంత కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదైనట్లు తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా పగటి ఉష్ణోగ్రతలు 28-నుంచి 31 డిగ్రీలుగా నమోదవుతుండగా, రాత్రి ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. రాజేంద్రనగర్‌లో 12.5 డిగ్రీలు, మెదక్ 12.8, పటాన్‌చెరులో 13.2, ఆదిలాబాద్‌లో 13.7, హకీంపేటలో 14.5, హనుమకొండలో 15, దుండిగల్‌లో 15.7, రామగుండంలో 14.6, నిజామాబాద్‌లో 16.1, హైదరాబాద్‌లో 16.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు తెలిపింది. ఖమ్మంలో 17, మహబూబ్‌నగర్‌లో 18.5, భద్రాచలంలో 18 డిగ్రీల ఉష్ణోగ్రతలు రికార్డయినట్లు వాతావరణ శాఖ వెల్లడించింది.

## అర్జున అవార్డు రేసులో టీమిండియా పేసర్



భారత ప్రభుత్వం అందజేసే ప్రతిష్టాత్మక క్రీడా అవార్డులలో రెండో అత్యున్నత పురస్కారమైన అర్జున అవార్డును ఈ ఏడాది టీమిండియా సీనియర్ పేసర్ మహ్మద్ షమీ దక్కించుకో బోతున్నాడా..? అంటే అవుననే అంటున్నాయి భారత క్రికెట్ వర్గాలు. ఈ మేరకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖకు ప్రత్యేకంగా సిఫారసు చేసినట్టు సమాచారం. ఇటీవల ముగిసిన వన్డే వరల్డ్ కప్‌లో షమీ.. ఏడు మ్యాచ్‌లలోనే 24 వికెట్లను తీసిన విషయం తెలిసిందే. ఈ టోర్నీలో అత్యధిక వికెట్లు సాధించినవారిలో షమీ అగ్రస్థానంలో ఉన్నాడు. ప్రపంచకప్‌లో తొలి నాలుగు మ్యాచ్‌లకు దూరంగా ఉన్న షమీ.. న్యూజిలాండ్‌తో ధర్మశాల వేదికగా ముగిసిన మ్యాచ్‌లో ఎంట్రీ ఇచ్చి అద్భుత ప్రదర్శనలతో రాణించాడు. భారత్ ఫైనల్ చేరడంలో షమీది కీలక పాత్ర. వరల్డ్ కప్ తర్వాత విరామం తీసుకుంటున్న షమీ.. త్వరలోనే సౌతాఫ్రికా వేదికగా జరగాల్సి ఉన్న రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ కోసం సిద్ధమవుతున్నాడు. డిసెంబర్ 26 న తొలి మ్యాచ్ జరగాల్సి ఉంది.

# అందనంత ఎత్తున ఐపీఎల్.. బ్రాండ్ వాల్యూలో మరో మైలురాయి

భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ)కి బంగారు బాతులా దొరికిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) బ్రాండ్ వాల్యూ అంతకంతకూ పెరుగుతున్నది. 2008లో మొదలైన నాటి నుంచి ఇప్పటివరకూ ఇంతింతై వటుడింతై అన్న చందంగా ఎదిగిన ఐపీఎల్.. బ్రాండ్ వాల్యూ విషయంలో మరో కీలక మైలురాయిని దాటింది. 16 సీజన్లు ముగిసి 17వ సీజన్‌కు రంగం సిద్ధం చేసుకుంటున్న ఈ మెగా లీగ్ బ్రాండ్ వాల్యూ 'డెకాకార్న్' స్టేటస్‌ను దాటింది. ఒక సంస్థ విలువ పది బిలియన్ డాలర్లు దాటితే దానిని డెకాకార్న్ అని పేర్కొంటారు. ఈ ఏడాది ఐపీఎల్ సీజన్ ముగిసే నాటికి ఐపీఎల్ బ్రాండ్ వాల్యూ 10.7 యూఎస్ బిలియన్ డాలర్లుగా ఉందని ప్రముఖ బ్రాండ్ వాల్యుయేషన్ కన్సల్టెన్సీ 'బ్రాండ్ ఫైనాన్స్' ఒక నివేదికలో వెల్లడించింది. అంటే ఈ గణాం కాల ప్రకారం ప్రస్తుతం ఐపీఎల్ బ్రాండ్ విలువ రూ. 89,236 కోట్లు.ఐపీఎల్ ప్రారంభ సీజన్ (2008) నుంచి ఈ ఏడాదితో పోల్చితే ఐపీఎల్ బ్రాండ్ విలువ ఏకంగా 433 శాతం పెరిగింది. గతేడాది ఐపీఎల్ మీడియా హక్కుల వేలం ద్వారా రూ. 48,390 కోట్ల ఆదాయం ఆర్జించడం ద్వారా ఐపీఎల్ వాల్యూ ఎవరూ ఊహించని స్థాయికి చేరింది. 2018, 2019లలో ఐపీఎల్ బ్రాండ్



విలువ వరుసగా 5.3 యూఎస్ బిలియన్ డాలర్లు, 5.7 యూఎస్ బిలియన్ డాలర్లుగా ఉండేది. కరోనా కారణంగా ఐపీఎల్ ఆదా యం భారీగా పడిపోయింది. 2020, 2021లలో ఇది 4.4 యూ ఎస్ బిలియన్ డాలర్లు, 4.7 యూఎస్ బిలియన్ డాలర్లకు పడిపో యింది. కానీ 2022లో ఐపీఎల్‌లోకి గుజరాత్ జెయింట్స్, లక్నో సూపర్ జెయింట్స్ జట్ల ఎంట్రీతో పాటు కరోనా తగ్గుముఖం పట్ట డంతో ఆదాయం రెట్టింపయ్యింది. దానికి తోడు మీడియా హక్కుల వేలం ఆదాయం కలిసిరావడంతో లీగ్ విలువ డెకాకార్న్ దాటింది.

### ఫ్రాంచైజీల పరంగా ముంబై టాప్..

ఫ్రాంచైజీల పరంగా చూస్తే ఐదు సార్లు ట్రోఫీ విజేత ముంబై ఇండియన్స్ 87 మిలియన్ల యూఎస్ డాలర్లు (రూ. 725 కోట్లు)తో అగ్రస్థానంలో ఉంది. ఆ తర్వాత స్థానాల్లో చెన్నై సూపర్ కింగ్స్ (రూ. 675 కోట్లు), కోల్‌కతా నైట్ రైడర్స్ (రూ. 657 కోట్లు), రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (రూ. 582 కోట్లు)లు ఉన్నాయి. గుజరాత్ టైటాన్స్, ఢిల్లీ క్యాపిటల్స్, రాజస్తాన్ రాయల్స్, సన్ రైజర్స్ హైదరాబాద్, లక్నో సూపర్ జెయింట్స్, పంజాబ్ కింగ్స్‌లు తదుపరి స్థానాల్లో నిలిచాయి. కెఎల్ రాహుల్ సారథ్యంలోని లక్నో సూపర్ జెయింట్స్ ఫాస్టెస్ట్ గ్రోయింగ్ ఐపీఎల్ బ్రాండ్‌గా ఉంది.

## అండర్ – 19 వరల్డ్ కప్‌లో మన యువసేన ఇదే.. హైదరాబాద్ కీపర్‌కు చోటు



వచ్చే ఏడాది దక్షిణాఫ్రికా వేదికగా జరగాల్సి ఉన్న అండర్ – 19 పురుషుల వన్డే ప్రపంచకప్‌లో ఆడబోయే జట్టును భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ప్రకటించింది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగనున్న భారత్‌ను ప్రస్తుతం అండర్ – 19 ఆసియాకప్‌లో యువ భారత్‌ను నడిపిస్తున్న ఉదయ్ సహరన్‌కే ప్రపంచకప్‌లోనూ భారత జట్టు పగ్గాలను అప్పజెప్పింది. మిడిలార్డర్ బ్యాటర్ అయిన ఈ పంజాబ్ కుర్రాడు సారథ్యంలో యువ భారత్.. జనవరి 20న బంగ్లాదేశ్‌తో తమ తొలి మ్యాచ్ ఆడనుంది.15 మంది సభ్యులతో కూడిన ఈ జట్టులో అండర్ –19 ఆసియాకప్ లో ఉన్న ఆటగాళ్లకే అవకాశమిచ్చింది. బ్యాటర్లుగా అర్షిన్ కులకర్ణి, ఆదర్శ సింగ్, రుద్ర మయూర్ పటేల్, సచిన్ దాస్‌లపై భారత్ భారీ ఆశలు పెట్టుకుంది. ఈ జట్టులో హైదరాబాదీ వికెట్ కీపర్ బ్యాటర్ అరవెల్లి అవనీష్ రావు ఫస్ట్ ఛాయిస్ వికెట్ కీపర్‌గా ఎంపికయ్యాడు. అతడికి బ్యాకప్‌గా హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన ఇన్నేశ్ మహారాజన్ ఉన్నాడు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన నమన్ తివారి, బరోడా పేసర్ రాజ్ లింబానిలు పేస్ భారాన్ని మోయనున్నారు. జనవరి 19 నుంచి ఫిబ్రవరి 11 వరకూ దక్షిణాఫ్రికాలోని ఐదు వేదికలలో ఈ టోర్నీ జరుగనుంది.

## కింగ్ కోహ్లి మరో ఘనత.. పాతికేళ్ల చరిత్రలో అతడొక్కడే..



పరుగుల యంత్రం విరాట్ కోహ్లి మరో అరుదైన ఘనత సాధించాడు. ఇదివరకే తన పేరిట లెక్కలేనన్ని రికార్డులు లిఖించుకున్న ఈ బ్యాటింగ్ మ్యాస్ట్రో.. సోషల్ మీడియాలో కూడా కింగ్ అన్న విషయం ప్రత్యేకంగా చెప్పాల్సిన పన్లేదు. గడిచిన దశాబ్దకాలంగా క్రికెట్‌కు సేవలందిస్తూ కోట్లాది అభిమానులను దక్కించుకున్న కోహ్లి.. గత 25 ఏండ్లలో గూగుల్ సెర్చ్ ఇంజిన్‌లో నెటిజన్లు వెతికిన టాప్ ఐకాన్స్ లిస్ట్‌లో కూడా చోటు సంపాదించుకున్నాడు. ప్రముఖ ఫుట్‌బాల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో, నేషనల్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ (ఎన్బీఏ) లెజెండ్ లెబ్రాన్ జేమ్స్ తర్వాత క్రికెట్‌లో అత్యధిక మంది వెతికిన క్రికెటర్‌గా అతడు రికార్డులకెక్కాడు.గూగుల్ సెర్చ్ ఇంజిన్ సేవలు మొదలై ఈ ఏడాదికి పాతికేళ్లు పూర్తైన సందర్భంగా తన ఎక్స్ (ట్విటర్) ఖాతాలో ఆ సంస్థ ప్రత్యేకమైన వీడియోను షేర్ చేసింది. ఈ 25 ఏండ్లలో ఇంటర్నెట్ రూపాంతరం చెందిన జర్నీని ఈ వీడియోలో చూడొచ్చు. ఈ పాతికేండ్ల కాలంలో గూగుల్‌లో అత్యధికులు వెతికిన (ఒక్కో విభాగం వారీగా) అంశాన్ని షేర్ చేసింది. ఇందులో ఫుట్‌బాల్‌ను 'మోస్ట్ సెర్చ్‌డ్ స్పోర్ట్'గా పేర్కొన్న గూగుల్ క్రిస్టియానో రొనాల్డోను మోస్ట్ సెర్చ్‌డ్ అథ్లెట్ గా తెలిపింది. క్రికెటర్ల జాబితాలో విరాట్ కోహ్లిని పేర్కొంది. ఈ పాతికేండ్లలో క్రికెట్ నుంచి కోహ్లి పేరు ఒక్కటే ఉండటం గమనార్హం. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. జమైకన్ చిరుత ఉసేన్ బోల్ట్.. వంద మీటర్ల పరుగు పందెంలో నెలకొల్పిన 9.58 సెకన్ల రికార్డు మోస్ట్ సెర్చ్‌డ్ రికార్డుగా నిలిచింది. నేషనల్ ఫుట్‌బాల్ లీగ్ (ఎన్ఎఫ్ఎల్) దిగ్గజం టామ్ బ్రాడీ 'మోస్ట్ సెర్చ్‌డ్ గోట్' జాబితాలో పేర్కొంది.

## చికెన్ టిక్కా తిన్న విరాట్ కోహ్లి.. షాకవుతున్న నెటిజన్స్.. అసలు ట్విస్ట్ ఇదీ



భారత్ స్టార్ క్రికెటర్, పరుగుల రారాజు విరాట్ కోహ్లి ఫిట్‌నెస్‌కి అధిక ప్రాధాన్యం ఇస్తాడన్న విషయం అందరికీ తెలిసిందే. నిరంతరం కష్టపడుతూ తన శరీరాన్ని దృఢంగా ఉంచుకుంటాడు. ఫిట్‌నెస్‌లో భారత క్రికెట్ జట్టు సభ్యులందరూ విరాట్‌ను స్ఫూర్తిగా తీసుకుంటారు. వ్యాయామం, డైట్‌కు అంతలా ప్రాధాన్యమిస్తాడు ఈ స్టార్ బ్యాట్స్‌మెన్. డైట్‌లో భాగంగా ఈ స్టార్ ఆటగాడు పూర్తిగా వెజిటేరియన్‌గా మారిన విషయం తెలిసిందే. అయితే, తాజాగా విరాట్ 'చికెన్ టిక్కా' తిని అందరినీ ఆశ్చర్యపరిచాడు.ఫిట్‌నెస్‌కు ఎంతో ప్రాధాన్యం ఇచ్చే విరాట్.. దాని కోసమే గతంలో వెజిటేరియన్‌గా మారాడు. పలు ఆరోగ్య సమస్యలు కూడా విరాట్‌ను వెజిటేరియన్‌గా మారేలా చేశాయి. ఈ విషయాన్ని కోహ్లినే పలు సందర్భాల్లో చెప్పాడు. అయితే, తాజాగా తాను 'చికెన్ టిక్కా' తిన్నట్లు సోషల్ మీడియలో ఓ పోస్ట్ పెట్టాడు. 'ఈ మాక్ చికెన్ టిక్కాను మీరు తప్పక ఇష్టపడతారు' అంటూ ఫొటోకి క్యాప్షన్ ఇచ్చాడు. ఇది చూసిన అభిమానులు ఒక్కసారిగా షాక్ అయ్యారు. 'ఇదేంటి.. కోహ్లి పూర్తిగా శాఖాహారి కద..? మరి ఇప్పుడేంటి చికెన్ టిక్కా తిన్నారు', 'కోహ్లి అబద్ధం చెప్పాడా..?' అంటూ కామెంట్స్ చేయడం మొదలు పెట్టారు.

## సూర్యను ఔట్ చేయగానే అలా ఎందుకు చేశానంటే..! 'షూ కాల్' సెలబ్రేషన్స్‌పై స్పందించిన షంసీ

భారత్–దక్షిణాఫ్రికా మధ్య మంగళవారం ముగిసిన రెండో టీ20లో టీమిండియా సారథి సూర్యకుమార్ యాదవ్‌ను ఔట్ చేయగానే సఫారీ బౌలర్ తబ్రేజ్ షంసీ వినూత్న రీతిలో సెలబ్రేట్ చేసుకున్నాడు. తన కుడికాలి షూ ని తీసి ఫోన్ చేస్తున్నట్టుగా 'షూ కాల్' సెలబ్రేషన్ చేశాడు. దీనిపై భారత అభిమానులు, నెటిజన్లు షంసీ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాజాగా షంసీ ఇలా ఎందుకు చేయాల్సి వచ్చిందో తెలిపాడు. అది జస్ట్ ఫన్ కోసమే చేసిందని, ఏ ఆటగాడినీ కించపరచడానికి కాదని వెల్లడించాడు.మ్యాచ్ అనంతరం షంసీ స్పందిస్తూ..'అది కేవలం ఫన్ సెలబ్రేషన్. గతంలో కూడా నేను పలుమార్లు వికెట్ తీయగానే అలాగే సెలబ్రేట్ చేసుకునేవాడిని. పిల్లలు దానిని చాలా ఇష్టపడతారు. కానీ మ్యాచ్‌లు చూడటానికి వచ్చే పిల్లలు చాలా మంది నన్ను పదే పదే దానిగురించి అడుగుతున్నారు. వాళ్లను డిసప్పాయింట్ చేయడం ఎందుకని అలా చేశాను. నేను ఈ విషయం చాలాసార్లు చెప్పాను. ఆ సెలబ్రేషన్ ఏ ఆటగాడిని కించపరచడానికి కాదు.. ' అని అన్నాడు.ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసి 55 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయిన భారత్‌ను సూర్యకుమార్ యాదవ్, రింకూ సింగ్‌లు ఆదుకున్నారు. ఈ ఇద్దరూ నాలుగో వికెట్‌కు 70 పరుగులు జోడించారు. 36 బంతుల్లోనే ఐదు బౌండరీలు, మూడు భారీ సిక్సర్ల సాయంతో సూర్య 56 పరుగులు చేశాడు. సూర్యతో పాటు భారత దూకుడుకు షంసీ అడ్డుకట్టవేశాడు. ఈ మ్యాచ్‌లో షంసీ నాలుగు ఓవర్లు వేసి 18 పరుగులే ఇచ్చి ఒక వికెట్ పడగొట్టాడు.



## అంతిమ్ పంగల్‌కు ప్రతిష్టాత్మక అవార్డు..


భారత రెజ్లింగ్ యువ సంచలనం అంతిమ్ పంగల్‌కు ప్రతిష్టాత్మక అవార్డు దక్కింది. 2023 సంవత్సరానికి గాను అంతిమ్.. 'రైజింగ్ స్టార్ ఆఫ్ ది ఈయర్ ' అవార్డును సొంతం చేసుకుంది. ప్రతిష్టాత్మక యూనైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యూడబ్ల్యూడబ్ల్యూ) ఈ అవార్డును అందజేసింది. 19 ఏండ్ల అంతిమ్.. గత రెండేండ్లుగా అద్భుత విజయాలతో వరుస టోర్నీలలో పతకాలు కొల్లగొడుతున్నది. ఆమె వచ్చే ఏడాది పారిస్ వేదికగా జరుగబోయే పారిస్ ఒలింపిక్స్‌లో సత్తా చాటేందుకు సిద్ధమవుతుండగా ఈ అవార్డు దక్కడం ఈ యువ బాక్సర్ ఆత్మ విశ్వాసాన్ని మరింత పెంపొందించేదే.గతేడాది అండర్ 20 వరల్డ్ ఛాంపియన్‌షిప్ లో అంతిమ్ మూడో స్థానంలో నిలిచింది. ఈ ఏడాది ఏకంగా అగ్రస్థానాన్ని కైవసం చేసుకుని ఛాంపియన్‌గా నిలిచింది. 2020లో 17 ఏండ్ల వయసులోనే అంతిమ్.. జూనియర్ ఆసియన్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణం నెగ్గింది. అండర్ –23 ఆసియన్ ఛాంపియన్‌షిప్స్‌లో రెండో స్థానం దక్కించుకుంది. ఇక కొద్దిరోజుల క్రితమే హాంగ్జౌ వేదికగా ముగిసిన ఆసియా క్రీడలలో కాంస్యం గెలిచింది. ఈ ఏడాది వరల్డ్ ఛాంపియన్షిప్స్‌లో కాంస్యం నెగ్గడంతో ఆమె పారిస్



ఒలింపిక్స్‌లో బెర్త్ ఖాయం చేసుకుంది.



తెలంగాణ వీణ
నిజం నిర్భయంగా..
సినిమా
గురువారం 14 డిసెంబర్ 2023



# మస్త్.. ఖుషీ!



పుట్టగానే కేర్‌కేర్‌మని ఏడవకుండా.. చిరునవ్వులు చిందించిందేమో! ఆ పాలబుగ్గల్ని చూసి పరవశించిపోయి.. సుస్మిత అని పేరు పెట్టారు కన్నవారు. సినిమా పరిశ్రమ మాత్రం.. ఉరకలెత్తే ఉత్సాహానికి ఫిదా అయిపోయి ఖుషీ అని నామకరణం చేసింది. కన్నడ పరిశ్రమలో తానేమిటో నిరూపించుకున్నాక.. తెలుగు సీమలో అడుగుపెట్టింది. 'పిండం' చిత్రం తనకు బ్రహ్మాండమైన మైలేజీ ఇస్తుందని నమ్ముతున్నది ఖుషీ రవి.

# 2023లో ఈ స్టార్ హీరోల అభిమానులకు నిరాశే..!

ప్రతీ ఏడాది లాగే 2023 కూడా కొంతమంది యాక్టర్లకు చాలా ప్రత్యేకమైన సంవత్సరంగా నిలిచిపోయిందనడంలో ఎలాంటి సందేహం లేదు.కానీ కొందరు స్టార్ హీరోలకు మాత్రం మరిచిపోలేని ఏడాదిగా నిలిచిపోనుంది. ఈ స్టార్ హీరోలంతా లీడింగ్‌లో ఉన్న వారే కావడం గమనార్హం. ఇంతకీ విషయమేంటంటే 2023లో మంచి బ్రేక్ అందుకున్న స్టార్ హీరోల మాట అటుంచితే.. ఈ ఏడాది అసలు ఒక్క సినిమా కూడా థియేటర్లకు తీసుకురాని స్టార్ హీరోల గురించే ఇప్పుడు ఇండస్ట్రీ అంతా చర్చ నడుస్తోంది. ఇంతకీ ఆ హీరోలెవరనేది ఊహించే ఉంటారు..ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, గ్లోబల్ స్టార్ హీరోలు రాంచరణ్ సూపర్ స్టార్ మహేశ్ బాబు. ప్రతీ ఏడాది ఒక్క సినిమా అయినా ఉండేలా ప్లాన్ చేసుకునే ఈ బడా హీరోలు ఎందుకో ఈ ఏడాది మాత్రం అభిమానులను నిరాశపర్చడం మూవీ లవర్స్‌కు కొంత జీర్ణించుకోలేని విషయమే అని చెప్పాలి. అయితే ఈ స్టార్ హీరోలు 2024లో అభిమానులకు కావాల్సిన ఫుల్ మీల్స్ అందించేందుకు ఇప్పటినుంచే రెడీ అవుతున్నారు. 2024లో బ్యాక్ టు బ్యాక్ రిలీజ్‌లతో బాక్సాఫీస్ వద్ద సందడి చేయబోతున్నారు. ముందుగా ప్రిన్స్ మహేశ్ బాబు త్రివిక్రమ్ శ్రీనివాస్ డైరెక్షన్‌లో నటిస్తున్న గుంటూరు కారం సినిమాతో బాక్సాఫీస్ బ్యాంగ్ షురూ చేయబోతున్నాడు. ఈ మూవీ జనవరి 13న విడుదల కానుంది.ఆ తర్వాత నేను కూడా బాక్సాఫీస్‌పై దండయాత్ర చేయడానికొస్తున్నాంటూ దేవర రిలీజ్ అప్‌డేట్‌తో చెబుతున్నాడు తారక్. దేవర చిత్రం ఏప్రిల్ 5న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. మరోవైపు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ టైటిల్ రోల్ పోషిస్తున్న పుష్ప.. ది రూల్ ఆగస్టు 15న రిలీజ్ కానుంది. ప్రస్తుతం రాంచరణ్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న గేమ్ ఛేంజర్. షూటి



ంగ్ దశలో ఉన్న పాన్ ఇండియా ప్రాజెక్టు 2024లోనే ప్రేక్షకుల ముందుకు రానుండగా.. విడుదల తేదీపై క్లారిటీ రావాల్సి ఉంది. మొత్తానికి హీరోల మాటెలా ఉన్నా సదరు స్టార్ హీరోల అభిమానులకు మాత్రం తీరని లోటు మిగిల్చిందనే చెప్పాలి. కనీసం వచ్చే ఏడాది అయినా తమ సినిమాలతో ఆ లోటును భర్తీ చేస్తారేమో చూడాలంటున్నారు మూవీ లవర్స్.

# రజనీకాంత్‌కు కింగ్ ఖాన్ శుభాకాంక్షలు

హైదరాబాద్: సూపర్ స్టార్ రజనీకాంత్ కు కింగ్ ఖాన్ షారుఖ్ ఖాన్ పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పారు. చెన్నై ఎక్స్ ప్రెస్ సినిమాలో లుంగీ డాన్స్ పాటలోని తన ఫోటోను షేర్ చేస్తూ, 'అనితరసాధ్యమైన మహానటుడికి పుట్టినరోజు శుభాకాంక్షలు. మమ్మల్ని ఎంటర్ టైన్ చేస్తూ, ఇలాగే మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలి' అంటూ షారుఖ్ ఇన్ స్టాగ్రామ్ లో పోస్ట్ చేశారు. షారుఖ్ నటించిన డంకీ సినిమా రిలీజ్ కి సిద్ధంగా ఉంది. సూపర్ హిట్ డైరెక్టర్ రాజ్ కుమార్ హిరానీ దర్శకత్వంలో తాప్సీ పన్ను, బొమన్ ఇరానీ, విక్కీ కౌశల్ కీలక పాత్రల్లో నటించిన డంకీ ఈనెల 21న విడుదల



కాబోతోంది. పఠాన్, జవాన్ సినిమాల సక్సెస్ తో జోరు మీదున్న షారుఖ్, డంకీ సినిమాతో హ్యాట్రిక్ కొట్టాలని పట్టుదలగా ఉన్నాడు.



# నాకు అమ్మాయిని కనాలనీ ఉంది..నా భర్త సహకరించడం లేదు: అనసూయ


హైదరాబాద్: అనసూయ భరద్వాజ్ పోస్ట్స్ సోషల్ మీడియాలో ఆసక్తి రేపుతుంటాయి. బుల్లి తెరకు గుడ్ బై చెప్పి వెండితెరపై హంగామా చేస్తున్న ఈ అమ్మడు ప్రస్తుతం అల్లు అర్జున్ పుష్ప-2 లో నటిస్తుంది. తాజా ఇంటర్వ్యూలో అనుసూయ పలు విషయాలు పంచుకుంది. తన అత్తగారిది బీహార్ అని, అక్కడ సంప్రదాయలు కూడా ఎక్కువని పది మందిలో ఉన్నప్పుడు కొంగు కప్పుకుని ఉండాలని, తనకు పిల్లలంటే చాలా ఇష్టం అని అన్నారు. తనకు ఆడపిల్లలను కనాలని ఉందని అత్తగారికి సిగ్గు విడిచి చెప్పానన్నారు. తన మాట వినగానే తనపై అత్తగారు కోప్పడ్డారని తెలిపింది. నాకు అమ్మాయిని కనాలనీ ఉంది కానీ నా భర్త సహకరించడం లేదంటూ బోల్డ్ గా చెప్పింది. అనసూయ కామెంట్లు విన్న నెటిజన్లు సోషల్ మీడియాలో కామెంట్లు చేస్తున్నారు.

# బుట్ట బొమ్మను చంపేస్తామని బెదిరింపులు.. క్లారిటీ ఇచ్చిన పూజా టీమ్.!



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ పూజా హెగ్డేకు సంబంధించి ఒక వార్త వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. పూజా హెగ్డేని చంపేస్తామని బెదిరింపులు వచ్చాయని సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అయ్యాయి. పూజా రీసెంట్‌గా దూబాయ్ వెళ్లగా.. ఆక్కడ ఒక ఈవెంట్?లో ఆమె గొడవ పడిందని.. ఈ కారణంగా పూజా?కు హత్యా బెదిరిపులు వచ్చాయని సోషల్ మీడియాలో వార్తలు వచ్చాయి. దీంతో పూజ ఫ్యాన్స్ ఆందోళన చెందారు. అయితే తాజాగా ఈ వార్తలపై పూజా టీమ్ స్పందించింది.పూజా హెగ్డేని చంపేస్తామని వచ్చిన బెదిరింపులు అబద్ధమని పూజా టీమ్ తెలిపింది. ఈ వార్తల్లో ఏ మాత్రం నిజం లేదని హీరోయిన్ టీమ్ క్లారిటీ ఇచ్చింది. ఈ ఫేక్ ప్రచారాలు ఎవరు స్టార్ట్ చేశారో తెలియదు. అదంతా పూర్తిగా అవాస్తవం అని పూజా టీమ్ చెప్పుకోచ్చింది. ప్రస్తుతం పూజా హెగ్డే 'కోయి షక్' అనే బాలీవుడ్ సినిమా చేస్తుంది. షాహిద్ కపూర్ హీరోగా వస్తున్న ఈ సినిమాను మలయాళ దర్శకుడు రోషన్ ఆండ్రూస్ తెరకెక్కిస్తున్నాడు.

# అభిరామ్ పెళ్లి.. వైరల్ అవుతున్న దగ్గుబాటి ఫ్యామిలీ పిక్.!



దగ్గుబాటి ఇంట పెళ్లి భాజాలు మోగిన విషయం తెలిసిందే. టాలీవుడ్ స్టార్ నిర్మాత దగ్గుబాటి సురేశ్ బాబు చిన్న కుమారుడు, హీరో రానా తమ్ముడు దగ్గుబాటి అభిరామ్ ఓ ఇంటివాడయ్యాడు. డిసెంబర్ 6న రాత్రి 8.50 గంటలకు శ్రీలంకలోని కలుతర పట్టణంలో అభిరామ్ పెళ్లి జరిగింది. తన కుటుంబానికి అత్యంత దగ్గరి బంధువైన ప్రత్యూషను దగ్గుబాటి అభిరామ్ బుధవారం పెళ్లిచేసుకున్నాడు. కుటుంబ సభ్యులు, అతిథుల సమక్షంలో వారిద్దరూ ఒక్కటయ్యారు. ఇక మూడు రోజుల పాటు ఈ వివాహ వేడుకను నిర్వహించారు. అయితే పెళ్లి తర్వాత హైదరాబాద్‌లో గ్రాండ్ రిసెప్షన్ ఏర్పాటు చేశారు. ఇక ఈ పెళ్లిలో వధువరులకు సంబంధించి ఒక్క ఫొటో కూడా బయటకు రాకుండా దగ్గుబాటి ఫ్యామిలీ జాగ్రత్త పడింది. ఇదిలా ఉంటే.. తాజాగా దగ్గుబాటి అభిరామ్ పెళ్లి నుంచి దగ్గుబాటి ఫ్యామిలీకి సంబంధించిన ఒక ఫొటో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది. ఈ ఫొటోలో దగ్గుబాటి సురేశ్ బాబు - ఆయన భార్య, వెంకటేష్ -ఆయన భార్య, వెంకటేష్ పిల్లలు, రానా- ఆయన భార్య మిహికా బజాజ్, నాగచైతన్య, అలాగే కుటుంబ సభ్యులు ఉన్నారు. దీంతో ఈ ఫొటో సోషల్ మీడియాలో ఫుల్ వైరల్ అవుతుంది.

# తారక్ దేవర గ్లింప్స్‌పై కల్యాణ్‌రామ్ స్టన్నింగ్ అప్‌డేట్



జూనియర్ ఎన్టీఆర్ ప్రస్తుతం దేవర సినిమాతో బిజీగా ఉన్నాడని తెలిసిందే. కొరటాల శివ డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రంపై అంచనాలు భారీగానే ఉన్నాయి. ఫిషింగ్ హార్బర్ విలేజ్, పోర్ట్ మాఫియా నేపథ్యంలో వస్తోన్న దేవరకు సంబంధించి ఇంట్రెస్టింగ్ అప్‌డేట్ అందించాడు నిర్మాత కల్యాణ్ రామ్. ఆర్ఆర్ఆర్ తర్వాత ఓ నటుడిగా తారక్ బాధ్యత పెరిగిందని.. ఇక నుంచి తప్పులు చేసేందుకుఎలాంటి ఆస్కారం ఉండబోదన్నాడు కల్యాణ్ రామ్.డెవిల్ ఈవెంట్‌లో దేవర గురించి కల్యాణ్ రామ్ మాట్లాడుతూ.. హైటెక్నికల్ వాల్యూస్‌తో సినిమా తెరకెక్కిస్తున్నాం.. అందుకే దేవర యూనిట్ టైం తీసుకుంటుంది. త్వరలోనే దేవర గ్లింప్స్ రాబోతుంది. దీనికి సంబంధించిన పనులు కూడా కొనసాగుతున్నాయి. దేవరతో మీరంతా కొత్త ప్రపంచంలోకి వెళతారు. సినిమాలో కథానుగుణంగా వీఎఫ్ఎక్స్ పనులు భారీగా ఉన్నాయి. వీలైనంత త్వరలో గ్లింప్స్ డేట్ ప్రకటిస్తాం.. అప్పటివరకు ఓపిక పట్టండి..అని చెప్పుకొచ్చాడు.కల్యాణ్ రామ్ తాజా కామెంట్స్‌తో నందమూరి అభిమానులకు త్వరలోనే అదిరిపోయే అప్‌డేట్ గ్లింప్స్ రూపంలో ఉండబోతుందని తెలిసిపోతుంది. గోవాలోని సెట్స్‌లో దేవర అండ్ గ్యాంగ్‌పై వచ్చే చిన్న సెలబ్రేషన్ మ్యూజిక్ బిట్‌ను షూట్ చేసినట్టు కొన్ని రోజుల క్రితం సూపర్ కిక్ ఇచ్చే అప్‌డేట్ అందించింది కొరటాల టీం. తారక్ సెట్స్‌లో డ్యాన్సర్లతో కలిసి దిగిన ఫొటోలు కూడా ఇప్పటికే నెట్టింట వైరల్ అన్నాయి.

Published and Printed by Vulloju Srinivas on Behalf of Sri Veena Publications Printed at Telangana Veena Flat N0: 204 Mythri Apartments,Opp Bsnl Office Ecil,Kapra,Med Responsible for Selection of News Under the PRB ACT, Phone number: 040 35668720,RNI Reg N0.TELTEL/12280 Reproduction in Whole or in Part Without Written